శ్రీ

చమత్కార రత్నావళి

గ్రంథకర్త:

కందుకూరి వీరేశలింగం పంతులు

నాల్గవ కూర్పు

ప్రకాశకులు:

హితకారిణీసమాజము

రాజమహేంద్రవరము

1950

ఈ నాటకమునందు వచ్చుపాత్రములు.

పురుషులు

ధర్మపాలుఁడు—చోళమండలపురాజు.

వర్ధమానుఁడు—పాండ్యదేశమునందలి మధురాపురవు వర్తకుఁడు.

పెద్దవసంతకుఁడు—వర్ధమానునకును చారుమతికిని గలిగినకవలబిడ్డలలో నొకఁడు.

చిన్నవసంతకుఁడు—వర్ధమానునకును చారుమతికిని గలిగినకవలబిడ్డలలో నొకఁడు.

పెద్దలక్ష్మణుఁడు—పెద్దవసంతకుని సేవకుఁడు, చిన్నలక్ష్మణునిసోదరుఁడు.

చిన్నలక్ష్మణుఁడు—చిన్నవసంతకుని సేవకుఁడు; పెద్దలక్ష్మణుని తోడఁబుట్టినవాఁడు.

కాంచనగుప్తుఁడు—ఒకవర్తకుఁడు; పెద్దవసంతకుని మిత్రుఁడు.

విశ్వకర్మ—కంసాలి.

ధనమిత్రుఁడు—చిన్నవసంతకునిమిత్రుఁడగు ఆంధ్రదేశపువర్తకుఁడు.

దుర్గాదాసు—భూతవైద్యుఁడు.

భద్రుఁడు—ద్వారపాలకుఁడు.

శ్వేతవాహనుఁడు—కారాగృహాధికారి.

కొందఱుభటులు, పౌరులు, మొదలగువారు.

స్త్రీలు

చారుమతి—వర్ధమానుని భార్య; వసంతకులతల్లి.

సీత—పెద్దవసంతకుని భార్య.

సుభద్ర—సీత చెల్లెలు.

ప్రభావతి—కాంచీపురమునందలి యొక స్త్రీ.

గౌరి—పెద్దలక్ష్మణుని భార్య.

ఒక పరిచారిక.

చమత్కారరత్నావళి

ప్రథమాంకము

ప్రథమరంగము:—కాంచీపురము, సభామందిరము.

[ధర్మపాలమహారాజుగారు సింహాసనాసీనులయి యుండఁగా భద్రుఁడను ద్వారపాలకుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

భద్రు—(చేతులు జోడించుకొని) ధర్మపాలమహాప్రభూ! దేవరవారి కేదో ముఖ్యాంశము నివేదింపవలసియుండి కారాగృహాధికారియైన శ్వేతవాహనుఁడు భటులతోడవచ్చి తమసందర్శనార్థమయి వాకిట వేచియున్నాఁడు. ఆజ్ఞ యయ్యెనేని, ఆతనిని స్వామి సమ్ముఖమునకు తోడితెచ్చెదను.

ధర్మ—మంచిది. ఆలాగున చేయుము.

భద్రు—మహాప్రసాదము దేవా! (అని వెళ్ళి కారాగృహాధిపతి మొదలగు వారిని వెంటఁబెట్టుకొని వచ్చుచున్నాఁడు)

శ్వే—(నమస్కరించి) స్వామీ! దేవరవారికొక్కవిన్నపము చేయవలసియున్నది. సెలవయ్యెనేని విన్నవించుకొనియెదను.

ధర్మ—నీవు మాతో మనవిచేసుకోవలసిన దేమో మనవిచేసికోవచ్చును.

శ్వేత—చిత్తము. ఈప్రాతఃకాలమున పాండ్యదేశపు వర్తకుఁడయిన యీతఁడు మన పురవీథులలో తిరుగుచుండఁగా రాజభటులీతనినిపట్టుకొని నావద్దకు తీసికొనివచ్చినారు. ఏలినవారి యుత్తరువునిమిత్తమయి యీతని నిక్కడకుఁ గొనివచ్చినాఁడను.

ధర్మ—(వర్తకునివంక దృష్టివఱపి) ఓయీ! నీపేరెవరు?

వర్త—నాపేరు వర్ధమానుఁడు. స్వామీ! నాకు శీఘ్రముగా మరణదండనమును విధించి నేటితో నాకష్టములను గట్టెక్కింపుఁడు.

ధర్మ—ఓయీ! నీవు మాయెదుట మఱేమియుఁ బలుకఁబోకుము. ఒక్కనికొఱకయి పాక్షికబుద్ధి వహించి మా దేశపుశాసనముల నెన్నటికిని మేము మీఱఁగలవారము కాము. అక్రమముగా నిచ్చుకొమ్మన్న ధనము నిచ్చుకోలేకపోయిన మాత్రముచేత నాఁడా ప్రకారముగా మీరాజు క్రూరుఁడయి న్యాయమార్గమున సంచరించుచున్న మా దేశవర్తకుల నందఱిని చంపించినప్పటినుండియు మా హృదయమునందు మీ దేశస్థులవిషయమునయి లేశమయినను దయయను మాట పుట్టకున్నది. ఆప్రకారముగా మీ దేశపువారికిని మా దేశపువారికిని విరోధము పుట్టినప్పటినుండియు అక్కడ మీవారును ఇక్కడ మావారును సభలుచేసి యిఁకముందొకరి దేశములో నొకరెప్పుడును వాణిజ్యము చేయకుండుటకయి కట్టుపాటుల నేర్పఱుచుకొన్నారు. అంతేకాక మీ దేశపువాఁ డెవఁడయినను మా దేశమునందెక్కడఁ గనఁబడినను తత్క్షణమే ప్రాణసంరక్షణార్థమయి వేయివరహాల నిచ్చిననేతప్ప లేనియెడల నాతని సొత్తంతయు దొరతనమువారి యధీనము చేసికొని యాతనిని సంహరింపవలయునని శాసనమొకటి యేర్పఱుచుకొన్నాము. ఇప్పుడు నీయొద్దనున్న సొమ్మంతయు ఎక్కువ వెలకు విక్రయించినను నూఱువరహాలకంటె తక్కువయే వచ్చును గనుక నేఁడు నీకు చావునిశ్చయము.

వర్ధ—దురంతములయిన చింతల ననుభవించి యనుభవించి యీమనుగడమీఁద రోఁతపుట్టియున్న నాకిప్పుడు చావన్న పరమసంతోషముగానున్న దే కాని లేశమయినను భయము కలుగుచుండలేదు.

ఈదినమున నస్తమించెడు సూర్యునితోఁగూడ నాదుఃఖమును నస్తమించునుగనుక మీరిట్లుచేయుట నాకు మహోపకారము చేయుటయే.

ధర్మ—ఓయి వణిజుఁడా! ఎఱిఁగి యెఱిఁగి మధురాపురవర్తకుల కెల్లను ప్రత్యక్షమృత్యువైన యీ కాంచీపురమున ప్రవేశింప నేలసాహసించితివి? ఇంతసాహసమున కొడిగట్టిన నీరాక కేదియో ప్రబల కారణ ముండకమానదు. కాఁబట్టి మీ దేశమును విడిచి మా దేశమున కేలవచ్చితివో కొంచెము చెప్పుము.

వర్ధ—దురదృష్టవంతుఁడనైన నాకు నాచరిత్రమును చెప్పుకొనుటకంటె విశేషభారమయినపని మఱియొకటిలేదు. అయినను దేవర యంతటివారు నావంటి యభాగ్యుని మన్నించి యడిగినప్పుడు మాత్రము చేసి చెప్పక నిరాకరించుట ధర్మము కాదుగనుక నావిపత్తులాత్మదోషమువలనఁ గలుగక దైవవశముననే వచ్చినవని లోకమునకంతకును తెలియుటకయి నన్ను నాదుఃఖము చెప్పనిచ్చినంతవఱకు నాదుర్దశలను వినిపించెదను వినుండు—నేను మధురాపురమున నొక సద్వంశమున జన్మించి, వాణిజ్యమువలన జీవనము చేయుచు, కులీనయు గుణవతియు సౌందర్యవతియు నగు చారుమతియను సుందరిని వివాహము చేసికొని, ఆమెతోఁగూడ కొంతకాలము సకలసౌఖ్యములు ననుభవించుచు సుఖజీవనము చేయుచుంటిని. అంతట వ్యవహారధర్మమునుబట్టి నేను సింహళద్వీపమునకు వెళ్ళవలసివచ్చినందున, గర్భిణియైయున్న భార్య నింటనే దిగవిడిచి యోడనెక్కిపోయి యక్కడనే వ్యాపారము మీఁద ఆఱుమాసములవఱకు నుంటిని. అటుతరువాత నింకను కొంత కాలమక్కడనే యుండవలసినట్లు తటస్థించినందున దుస్సహమయిన పతివిరహమునకు తాళఁజాలక పలుమాఱు వర్తమానములఁ బంపుచు వచ్చిన ప్రాణసమానురాలయిన నాభార్యనుకూడ నాయొద్దకే పిల్చి

పించుకొంటిని. అక్కడకు వచ్చిన కొన్నిదినములలోనే నా భార్య ప్రసవమయి దివ్యసుందరవిగ్రహములు గల యిద్దఱు కవలపిల్లలను గనియెను. వారిద్దఱును అచ్చునఁ బోసినట్లు భేదమెంతమాత్రమును లేక యేకరీతిగా నున్నందున, ఒకరినుండి యొకరి నానవాలుపట్టుట యసాధ్యముగా నుండెను. ఆదినముననే దైవయోగముచేత మేము దిగియున్న సత్రములోనే కాపురమున్న యొక బీదదానికికూడ సరిగా నొక్కరీతిగానున్న యిద్దఱు కవలపిల్లలు పుట్టిరి. వారి తల్లిదండ్రులు నిరుపేదలౌటచేత వారు తమబిడ్డల నమ్మఁజూపగా, నాకొమాళ్ళవద్ద నీడుజోడుగానుండి యాడుకొనుచు సేవచేయుచుండుట కక్కఱకువత్తురనియెంచి, వాండ్రనుకూడఁగొని కన్నబిడ్డలవలె పెంచుచుంటిమి. స్వభావముచేత రూపములయందీషత్తును భేదములేనివారికి నామములచేతమాత్ర మెంతకుభేదము కల్పింపవలెనని యెంచి, నా కొమాళ్ళకిరువురకును వసంతకులనియు సేవకులకిద్దఱకును లక్ష్మణులనియు నామకరణములు చేసితిమి. అటువంటి ముద్దుమూటగట్టు కొమాళ్ళు గలుగుటవలన పట్టరాని గర్వముకలదయి యెప్పు వారిని తీసికొనిపోయి బంధువులకెల్లను జూపువలయునను సంతోషముతో నాభార్య ప్రతిదినమును దేశమునకు వెళ్ళుదముకమ్మని నన్ను ప్రయాణములు చేయ నారంభించెను. అహోరాత్రములు చెవి నిల్లుకట్టుకొని పోరుచుండఁగా నేనాపోరు పడలేక తుదకు విధిలేక యొప్పుకొని కష్టపడవలసిన యోగముండి యిష్టములేకయే నొకదినమున నోడనెక్కి సపరివారముగా బయలుదేఱితిని. ఎటువంటివర్జ్యసమయమున నిల్లువిడిచితిమో కాని మేము లంకవిడిచి క్రోసెడు దూరమునైనను రాకమునుపే భయంకరమయిన గాలివాన యారంభమయినది. అది యంతకంతకు ప్రబలి మహాభయావహమయినందున నావికులు నిరాశులయి తమ

ఓడను రక్షించుకొను మార్గమునుగానక ప్రతినిమిషమును గాలిదెబ్బకు పగిలిపోవ సిద్ధముగానున్న యోడలో మమ్మువదలిపెట్టి తమ ప్రాణములను దక్కించుకొనుటకయి యందఱును ప్రక్కలనుగట్టియున్న చిన్నపడవలలో నెక్కి పాఱిపోయిరి. నామట్టుకునాకు చావన్ననంతభయము లేకపోయినప్పటికిని దగ్గఱఁజేరి కంటికి నేలకును నేకధారగా గోలుగోలున నేడ్చుచున్న భార్యను, భయమెటువంటిదో యెఱుఁగకపోయినను తల్లియేడుపుచూచి వేడుకకొఱకు కన్నకడుపు దహించుకొని పోవునట్లు పెద్దపెట్టున రోదనముచేయుచున్న పిల్లలనుజూచి, వారి నిమిత్తమయి నామనస్సు తామరాకులోని నీరువలె తల్లడిల్లఁగాగెను. ఈప్రకారముగా కొంతసేపు వారిరక్షణోపాయమును వెదకుటకయి దీర్ఘాలోచనలో మునిఁగియుండి కడకొక యుపాయము నాలోచించి గాలివానలు పట్టునప్పుడు పనికివచ్చుటకయి పడవవాండ్రు నిలువచేసికొన్న చాపకొయ్యలలో నొకదానికి చిన్నవసంతకు నొక్కచివరను చిన్నలక్ష్మణు నొక్కచివరనుగట్టి నడుమను నేను కట్టుకొంటిని. అప్పుడు దుఃఖసముద్రములో మునిఁగియున్న నాభార్యనుగూడ నేనుజేసినట్లే చేయుమని బోధింపఁగా నామెయు మిగిలియున్న చిన్నవాండ్ర నిరువురను చెఱియొక చివరను మఱియొక చాపకొయ్యకుకట్టి తాను మధ్యకట్టుకొనెను. కీడులో మేలు దైవమనుగ్రహించి నాకప్పు డాయుపాయమును తోఁపించినందున, అప్పుడే మృతినొందక నాకష్టకథలను మీవంటివారికి చెప్పుచుండుటకయి భూమిమీఁద నీలాగున బ్రదికితిని. మేమిరువురమును ప్రాణాధికులయిన మాబిడ్డల మీఁదనే కన్నులుపెట్టుకొని ప్రవాహవేగమునుబట్టి పడవ పోయినట్లెల్ల రామనాథపురమునకేసి కొట్టుకొనిపోవుచుంటిమి. ఇంతలో మబ్బువిడిచిపోయి కన్నులు మిఱుమిట్లుగొనునట్లుగా ఆకాశమధ్యమున సూర్య

బింబము కనఁబడెను; అవఱకావరించియున్న చీఁకట్లన్నియు నిమిష ములో మాయమాయెను; కొండపొడుగున లేచు తరంగములన్నియు నణఁగి సముద్రము నిశ్చలముగా నుండెను; సముద్రమునంతనుఅల్ల కల్లోలముగాఁజేసిన వాయువంతయు శాంతించెను. అప్పుడు మాకు ముందు దూరమున రెండునావలు కనఁబడెను. ఆనావలు చేరువకు రాకముందే—(గద్గదస్వరముతో) ఇఁక నేమియు నేను చెప్పజాలను. దీనినిబట్టి దానిని మీరూహించుకొనుఁడు.

ధర్మ—ఓయి వృద్ధుఁడా! ఈప్రకారముగా కథను నడుమ త్రెంపివేయక కడముట్ట చెప్పుము. మేము నిన్ను క్షమింపలేకపోయి నను నీకథవిని జాలినైనను పొందుదుము.

వర్ధ—ఆనావలు దగ్గఱకు రాకముందే మేమున్నయోడ యొక పర్వతమును గొట్టుకొని దారుణధ్వనితో ముక్కముక్కలుగా పగిలి పోయెను. ఆయుత్పాతముచేత మేము చాపకొయ్యల నంటిపట్టుకొని నీళ్ళపయిన తేలి కొట్టుకొనిపోవుచుంటిమి. నేనునాప్రాణముతోపాటు మఱియిద్దఱ ప్రాణములను గూడ కాపాడవలసినవాఁడ నగుటచేత, నా భార్యకును తక్కినవారికిని నేనేమియు తోడుచూపలేకపోతిని. అం దుచేత నా భార్య యిరువురపిల్లలతోను ప్రవాహవేగము ననుసరించి మఱియొకవైపునకు కొట్టుకొనిపోవుచుండెను. అయినను వారుచూపు మేరదూరములో నుండఁగా నే యెవ్వరో చిన్నపడవలోవచ్చి వారి నెక్కించుకొని కొంతసేపటిలో దృష్టిపథమును దాటిపోయిరి. వారి నట్లు తమపడవలో నెక్కించుకొన్నవాండ్రు రామనాథపురమునుండి చేపలఁబట్టుటకయి వచ్చిన పల్లెవాండ్రయి యుందురని నేనూహచేసి కొంటినిగాని, ఆతీసినవారెవరో తరువాత వారిగతి యేమైనదో యె న్నివిధముల ప్రయత్నముచేసినను నేటివఱకును నాకు తెలియనే

లేదు. హా దైవమా! వారెట్టి యాపదలపాలయి యెక్కడ కష్టపడు చున్నారో గదా!

ధర్మ—ఓయి వెఱ్ఱివాఁడా! వారినిమిత్తమయి నీవు విచారపడుచున్నావే కాని నీకు రాఁబోవుచున్నగతిని నీవు విచారించుకోకున్నావు. అటుతరువాత నేటివఱకు నేమి జరిగినదో వివరముగా తెలుపుము.

వర్ధ—వారు సుఖముగా పడవలో నెక్కించుకోఁబడఁగా కన్నులార చూచితిని గనుక, నా ప్రియపుత్రునిని భృత్యునిని ఏలాగునయిన బ్రతికించుకోవలెనని సముద్రతరంగములతో పోరాడుచుండుట తప్ప నా కప్పుడు మాఱుచింత లేకపోయెను. ఈప్రకారముగా సముద్రములోఁబడి ముందుకు వెనుకకు అలలీడ్చినట్లెల్ల పోవుచు తిరుగుడు పడుచుండ, దైవికముగా నాసమయమున నాదారిని పోవుచున్న యోడ యందున్న మనుష్యులు దూరమునుండి మమ్ముఁజూచి తమయధికారికి చెప్పఁగా నతఁడును సదయహృదయుఁడయి యోడను మా దగ్గఱకు పట్టించి మమ్ము నెక్కించుకొనియెను. పడవవాండ్రందఱును మును పన్నెఱిఁగినవారగుటచేత సమస్తవిధముల నన్నాదరించి సకలోపచారములను జేయుచు సుఖముగా మమ్ము మధురాపురమునకుఁ గొనిపోయి విడిచిపెట్టిరి. ఇల్లుచేరినతరువాతసంసారము మీఁది విరక్తిచేత నేనుమరలవివాహము చేసికోక, క్రమక్రమముగా దుఃఖమునంతను మఱచిపోయి ప్రాణములనన్నిటిని నాచిన్నకుమారుని మీఁదనే పెట్టుకొని, ఒకవిధముగా కాలము గడపుచుంటిని. ఇట్లు కొంత కాలము జరగఁగా నాబహిఃప్రాణమైనద్వితీయపుత్రుఁడు పదునెనిమిదిసంవత్సరముల వయస్సు గలవాఁడయి తనతల్లి యేమయినదని యొకనాఁడు నన్నడిగెను. నేనును కన్నీరుకాలువలుగట్ట నడచిన

సర్వవృత్తాంతమును పూసగ్రుచ్చినట్లతనికి వినిపించితిని. అదివిన్నది మొదలుకొని యతనిచిత్తమంతయు తల్లిని సోదరుని వెదకుటమీఁద పోయి, తనవలెనేయున్నను పోఁగొట్టుకొని విచారించుచున్నభృత్యుని తనకుతోడిచ్చి వారిని వెదుకఁ బంపుమని నన్ను ప్రతిదినమును పీడింపసాగెను. భార్యాపుత్రుల సమాచారము తెలిసికోవలె నని మనసులో నాకెంతో యపేక్ష గలిగి యుండియు వారినిమిత్తమయి యీయున్న యొక్కకుమారునినికూడ పంపివేసి యొక్కఁడను నుండ మనసొప్పక యిదిగో రేపుపంపెద నదిగో మాపుపంపెదనని యొక పట్టున సమ్మతింపక కొంతకాలము జరపితిని. ఆపిమ్మట దినదిన క్రమమున పుత్రునినిర్బంధ మెక్కువ కాఁగా, అతనిప్రార్థనను తీసి వెయ్యలేక తుదకెట్లో సమాధానపడి వెళ్ళి వేగిరము రా ననుమ తించితిని. నాకొమారుఁడును సేవకుఁడును నన్నువదలివెళ్ళినతరువాత ప్రతినిమిషమును వారిరాకకయి యెదురుచూచుచు, నేఁడువచ్చెదరో రేపువచ్చెదరో యని స్వప్నావస్థయందుసహితము వారినే తలఁచు కొనుచు నెంతో కష్టముమీఁద రెండుసంవత్సరములవఱకును నోర్చు కొని యుండి, అప్పటికిని వచ్చుజాడ కానరానందున నిఁకనింటకాలు నిలువక మేరమీఱిన పుత్రస్నేహమున బయలుదేఱి రెండుసంవత్స రములనుండి క్రమముగా మళయాళము, కన్నడము, కొంకణము, ఘూర్జరము, మాళవము, నేపాళము, బంగాళము మొదలయినదేశ ములనెల్ల వెదకి యెం దెందును వారిని గానక, అచ్చటనుండి దక్షి ణాభిముఖుఁడనయి యుత్కలదేశముమీఁదుగా నాంధ్రదేశము ప్రవే శించి యం దించుకయు వారిజాడ తెలియక విసిగి వేసరి వారియాశ నిరాశ చేసికొని యింటివంక మరలివచ్చుచు, మనుష్యసంచారము గలదేశములలో దేనిని వెదకకుండ విడిచిపెట్టిపోవబుద్ధిపుట్టక, చావున

కయిన నొప్పిగొని కడ కీదేశము చొచ్చితిని. ఈదినముతో నిచట
నాకథాశేష మైనది. నాకిప్పుడు మఱి యేమియు విచారము లేదు.
గాని నాపుత్రకళత్రాదులు జీవముతో నున్నా రన్నశుభవార్త నా
చెవిని బడిన సంపూర్ణసంతోషముతో నీదేహమును విడుతునుగదా
యనిమాత్రము చింతపడు చున్నాను.

ధర్మ—రాజునకుసహిత మలంఘ్యమయిన మాదేశ రాజ
శాసనమునకు విరుద్ధము కాకుండెనేని సంతోషపూర్వకముగా మే
మీవఱకే నిన్ను క్షమించి విడిచిపెట్టి యుందుము. రాజశాసన మీ
విషయములో నెంతో క్రూరముగా నున్నది; మేమేమి చేయుదుము?
మేము చేసిననిబంధనలను మేమే తగవుమాలి యతిక్రమించుట మా
గణ్యతకు తగినపని కాదని నీకును తెలియునుగదా? న్యాయమును
బట్టి మాచట్టముల విధులప్రకారము నిన్నిప్పుడే చంపింపవలసినది
మాకర్హాకృత్యమయినను, ఏదియెట్లయినను విచారింపక నీకు మే
మొక్కయుపకారమునుమాత్రము చేయ నిశ్చయించుకొన్నారము.
నీయావచ్ఛక్తిని వినియోగించి యేలాగున నైన నీసాయంకాలము
లోఁగా ఈగ్రామములో నెవ్వరియొద్దనైన బదులుచేసిగాని యెవ్వరి
నైన వేడికొనిగాని తెచ్చియపరాధము విధించినధనమును చెల్లిం
పుము. నీకీదినము గడువిచ్చినారము; పొమ్ము. ఆప్రకారముగాఁ
జేయఁగలిగితివేని నీవు బ్రదుకుదువు; లేదేని, ఈసాయంకాలముతో
నీదేహము నీది కాదు.—(కారాగృహాధికారివంకఁదిరిగి) ఓశ్వేత
వాహనా! కావలితో నీ వీతనివెంటనుండి కోరినచోటికెల్లనుతీసికొని
పొమ్ము.

శ్వేత—చిత్తం మహాప్రభూ!

ధర్మ—మే మిప్పు డంతఃపురమునకు విజయంచేసెదము. సాయంకాల మీతని తీసికొని మీరు మరల రండి.

(అని నిష్క్రమించుచున్నాఁడు.)

వర్ధమా—(తనలో) అయ్యో! కాని దేశములో దిక్కుమాలిన పక్షినయి చచ్చిపోవుచున్నానుగదా? ఇక్కడ నన్నెఱిఁగివా రెవ్వరున్నారు? ఒక్క విదేశీయుని నమ్మి దండుగ చెల్లించుటకై యింత సొమ్ము దానరూపమునఁగాని ఋణరూపమునఁగాని మొగమెఱుఁగని వాఁడెవ్వఁడిచ్చును? నన్నింతసేపు బ్రతుకనిచ్చిన నాకంత యధిక వేదన కలిగించుటయే కాని యుపకారము చేయుట కాదు.

(అని కారాగృహాధికారి వెంట నడిచెను.)

ద్వితీయరంగము—ఒక బహిరంగ ప్రదేశము.

[చిన్నవసంతకుఁడును చిన్నలక్ష్మణుఁడును, ధనమిత్రుఁడను వర్తకుఁడును ప్రవేశించుచున్నారు.]

ధన—ఆంధ్రదేశములో మనకిద్దఱకును గలిగిన మైత్రినిబట్టి నీకొక్క హితోపదేశము చేయుచున్నాను. నీవు మధురాపురవాసుఁడ వని యెవ్వరితోను ననక, ఆంధ్రదేశస్థుఁడనని చెప్పుకొమ్ము. నీవు పాండ్యమండలపువాఁడవని తెలిసినపక్షమున నీసొమ్మంతయు రాజు దండుగ పుచ్చుకొనును. గ్రహచారముచాలక యిక్కడకు వచ్చినందునకయి యాదినముననే పాండ్యదేశవర్తకుఁ డొకఁడు పట్టుకోఁబడి యున్నాఁడు. పాపము! అతఁడు తనప్రాణరక్షణార్థమయి తగినంతధనము నిచ్చుకోలేకపోవుటచేత సూర్యాస్తమయములోపల రాజశాసనమునుబట్టి రాజభటు లాతనిప్రాణములు తీసివేయుదురు. నీవు

నాదగ్గఱనుంచిన సొమ్మిదిగో పుచ్చుకొమ్ము. (అని యొకమూటను తీసి యిచ్చుచున్నాఁడు.)

చిన్నవసం—(పుచ్చుకొని) లక్ష్మణా! నీవీసొమ్ము తీసికొని పోయి నేను తిరిగివచ్చినదాఁక మనము దిగినసత్రమువద్దపదిలముగా కనిపెట్టి యుండుము. భోజనసమయములోపల నేనీపట్టణము నాలుగు మూలలును తిరిగి యిందలివిశేషములనుచూచి వచ్చెదను. నేనిప్పుడు మార్గాయాసముచేత బడలియున్నను, ఇక్కడివింతలను జూచువఱకును నాకు విశ్రాంతిపొంద పుట్టకున్నది.

చిన్నలక్ష్మ—నీమాటలనుబట్టి నిన్నెవ్వరో ఆనవాలుపట్టి నిన్నుపట్టుకొని చెరసాలలో పెడుతారు. నీకేల వెళ్ళు.

(అని నిష్క్రమించెను.)

చిన్నవసం—ధనమిత్రా! చిన్నప్పటినుండియు నాదగ్గఱ మిక్కిలి చనువగుటచేత సంకోచింపక హాస్యవచనములను పలికివీఁడు నన్నునవ్వించి నామనసులో విచారముగా నున్నప్పుడు వినోదము కలిగించుచుండును. నాతోకూడ నీవు కొంచెముసేపు తిరిగి పట్టణము చూపింపఁగలవా? మనమిద్దఱమును గలిసివెళ్ళి యీపూట మాబసలోనే భోజనము చేయుదము.

ధన—ఈపూటకు నన్నుక్షమించి వదలిపెట్టవలెను. ఈవఱకే నేనొకవర్తకునియింటికి భోజనమునకు వచ్చెదనని వాగ్దానముచేసి యున్నాను. నేనిప్పుడు వెంటనే వెళ్ళవలెను. నేను మధ్యాహ్నము మరల వచ్చి చీఁకటి పడువఱకును నీతోకూడ నుండి యీపట్టణము నందలి విచిత్రములనెల్లను నీకు చూపెదను.

చిన్నవసం—మంచిది. నీవువెళ్ళుము. మాదేశస్థునినెవ్వనినో పట్టుకొన్నారని విన్నప్పటినుండియు నామనసులో నేలాగుననో.

యున్నది. ఇక్కడక్కడ కొంచెము తిరిగి యిప్పుడే నేనును వెళ్ళి యిల్లుచేరెదను.

ధన—నీమనసువచ్చినట్లు చేయుము. నేను పోయివచ్చెదను.
(అని వెళ్లుచున్నాఁడు.)

చిన్నవసం—(తనలో) అయ్యో! ఒకజలబిందువు మహాసముద్రములోఁ బడిన మఱియొక జలబిందువును వెదకి పయికి తీసికొని వచ్చుటకయి పనిపూసి యందు ప్రవేశించి యామహార్ణవములో తానుగూడ కనఁబడకయడఁగిపోయినట్లు, మందభాగ్యుడనైన నేనును తప్పిపోయినయన్నను తల్లిని వెదకుదునని బయలుదేఱి యిల్లు విడిచి వాకిలివిడిచి యీనాహాసంఘములోఁబడి కానిదేశములో పరిభ్రమించుచున్నాఁడను.—అడుగో లక్ష్మణుఁడు వచ్చుచున్నాఁడు!

[పెద్దలక్ష్మణుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

లక్ష్మణా—అప్పుడే వచ్చినావేమి?

పెద్దలక్ష్మ—అప్పుడేనా? ఇప్పటికే నేనెంతో ఆలస్యంగా వచ్చినాను. దేవరవారు యింటికిం వేగిరం వేంచేయకపోవడంచేత, యింటికాడ అన్నమూకూరలూ చల్లారిపోయినవి. మీకీ వేళభోజనం మీఁద ధ్యానం లేనట్లున్నది. మీకేమి? మీస్థితి చూస్తే మీ రెక్కడనో దిట్టంగా విందారగించినట్టు తోస్తూవున్నది. మీకోసం వుసూరుమని యింటికాడ పడి ఆకలితో మలమల మాడి మేము చస్తూవున్నాము.

చిన్నవసం—ఈపరిహాసంగ మింతటితో చాలించియిప్పుడునీచేతి కిచ్చిన సొమ్మెక్కడ పెట్టివచ్చినావో ముందుగా నాతో చెప్పు.

పెద్దల—కూలివాడి కిమ్మని యిచ్చిననాలుగు డబ్బులూనా? న్నాకెందుకు? నేను వాడి కప్పుడే యిచ్చి పంపివేసినాను.

చిన్నవసం—నే నిప్పుడు మనసులో నేమియు నుల్లాసముగా లేను. నాముందర నింక ముద్దులుకుడువక సొమ్మేమి చేసినావో నిజము చెప్పు. మన మీయూరికి క్రొత్తవారమయి యుండఁగా, అంతసొమ్మేలాగున నౌకరిని నమ్మి యొప్పగించి వచ్చినావు?

పెద్దల—ఇప్పుడు నాతో పరియాచక మాడుతూవున్నారా యేమిటి? కావలిస్తే భోజనా లయినతరువాత నెమ్మదిగా కూర్చుండి కావలసినంతసేపు మీమనసువచ్చినట్టు హాస్యా లాడుకోవచ్చును. అమ్మగారు మిమ్మల్ని వేగిరం తీసుకురావలసిన దని నన్ను పంపించి నారు. మిమ్మలిని వేగిరంతీసుకువెళ్ళపోతే, ఆమెగారు నాపనిపట్టి స్తారు. తరువాత మీదోషంచేత నేను దెబ్బలు తినవలసివస్తుంది. వేగిరంలెండి.

చిన్నవసం—(కోపదృష్టితో) ఓరీ! లక్ష్మణా! ఇటురా భద్రము! హాస్యమున కిది సమయము కాదు. ఈమాటలన్నియూ సమయమువచ్చినదాఁక దాచుకొని, ముందుగా నీచేతికిచ్చిన ధనమేమయి నదో నాకుచెప్పు.

పెద్దల—నాచేతికా? నాచేతికి మీరు ధనం యెందుకిచ్చారు?

చిన్నవసం—ఓరీ తస్కరశ్రేష్ఠుఁడా! ఈలాగున దయచేసి కొంచెముసేపు నీమర్కటచేష్టలు కట్టిపెట్టి నీమీఁదపెట్టినపని యేమి చేసినావో చెప్పు.

పెద్దల—నామీఁదపెట్టినపని మిమ్మల్ని భోజనానికి యింటికి తీసికొని వెళ్ళడమే. అమ్మగారున్ను ఆమెచెల్లెలున్ను మీకోసం కని పెట్టుకొనివుంటారు. రండి వెళుదాము.

చిన్నవసం—నీచేతికిచ్చిన వేయివరాలును సురక్షితముగా నెక్కడదాచివచ్చినావో యీసారి నిజముగాచెప్పు. చెప్పనిపక్షమున,

నామనస్సులో నెమ్మదిలేనప్పు డీప్రకారముగా మేలమాడుచున్నం దుకు నీతలకాయ పగులఁగొట్టెదను.

పెద్దల—నావద్ద వేయివరాలు లేవుకాని దేవరవారు తల మీఁదవేసినవీ దేవిగారు బుజాలమీఁద వేసినవీ మొయ్యలేకుండా వెయ్యి దెబ్బలున్నవి. కావలిస్తే వాటినన్నిటినీ వడ్డీతో కూడా మీకు తీర్చ గలను.

చిన్నవసం—ఆ! అమ్మగారు బుజములమీఁద వేసినవా? నీ కిక్కడ నేయమ్మగా రున్నారురా నిర్భాగ్యుఁడా!

పెద్దల—ఏయమ్మగారా! తమభార్యాగారు. తమరువచ్చిం దాకా భోజనంచెయ్యకుండా కనిపెట్టుకువుండి తమరిని వెదకి తీసు కొనిరమ్మని నన్ను పంపించిన అమ్మగారు. ఇప్పుడు తెలిసిందా?

చిన్నవసం—నాకేమియు తెలియదు. నీయమ్మగారిని గృహ మునుకూడ తగులఁబెట్టిరా. నాకిల్లునులేదు భార్యయునులేదు. కొంచె మైనను భయములేకుండ నన్నీలాగున మొగముమీఁదనే మొగతాళి చేయ మొదలుపెట్టినావా? నిన్నేమిచేసెదనో చూడు.

(అని నెత్తిమీఁద కొట్టుచున్నాఁడు.)

పెద్దల—(చేయడ్డముపెట్టి) ఇదేమిటి? నన్ను నిష్కారణంగా కొడుతూవున్నారు? నన్నుపోనిండు. (అని పాఱిపోవుచున్నాఁడు).

చిన్నవసం—(తనలో) ఈపాపాత్ముఁడేదో మాయోపాయము చేసి నాధన మపహరించి నాపని కాఁజేయుదలఁచినాఁడు. ఇది పంచ మహాపాతకుని పట్టణమని మున్నెప్పుడును వినుచుందును. అది యి ప్పుడు నిజమయినది. నిమిషములో కన్నులుగప్పి యింద్రజాలముచేసి వస్తువుల నపహరించువారును, క్షణములో మతులుమార్చి మోసము చేసి చూచినదానినెల్ల మాయముచేయువారును, మాటలతో బయల

పందిళ్లు వేసి యీ అచేతిలో స్వర్గము కనఁబఱిచి ధనములాగువారును, ఈపట్టణమునిండ కుప్పతిప్పలుగా నున్నారట! ఇదియే సత్యమయ్యేనేని నేటితో నేను చెడిపోయినాను. నేటి కాలమునకు నాధనమునకు తెక్కలు వచ్చి దానికిని నాకును ఋణము చెల్లిపోయి నావద్దనుండి అదియెగిరి పోయినది కాఁబోలును! నేనును చప్పున సత్రమువద్దకుపోయి వాఁడక్కడ నున్నాఁడేమో వెదకి పట్టుకొనెదను. (అని వెళ్ళుచున్నాఁడు)

ద్వితీయాంకము

ప్రథమరంగము — పెద్దవసంతకుని గృహము

[సీతయు, సుభద్రయు, ప్రవేశించుచున్నారు]

సీత—సుభద్రా! ఇదేమి? నాప్రాణేశ్వరుఁడున్ను రాలేదు; నాప్రాణేశ్వరుని వేగిరం వెదకి తీసుకురమ్మని పంపిన భృత్యుఁడున్నా జాడలేదు. ఇప్పుడు రెండుజాములు దాటిపోయింది.

సుభ—ఎవరైనా అతణ్ని భోజనానికి పిలుచుకొనిపోయినారేమో! అతడు యింటికి రాకుండానే మధ్యదారిలోనుంచే వెళ్ళివుండవచ్చును. భోజనానికివచ్చే వేళ మించిపోయింది. ఇఖమనం కనిపెట్టుకుని వుండనక్కర లేదు; భోజనంచేతాములే. మగవాళ్ళుపరమస్వతంత్రులు; వాళ్ళేమిచేసినా మనమేమీ అనకూడదు.

సీత—మనకులేని స్వాతంత్ర్యము మగవాళ్ళకుమాత్ర మెందుకుండవలెను? నేనెక్కడకయినా వెళ్ళి వక్కదినము వేళకు యింటికి రాకపోతే వారూరుకుంటారేమో!

సుభ—మనవలె మగవాళ్ళు యింట్లోకూర్చుండవలసినవాళ్లు కారు. వాళ్ళు బయిటతిరిగి పనిచేసి కుటుంబపోషణానికయి చెమట

పూడ్చి కష్టపడి సంపాదించి తేవలసినవారు. అందుచేతనే వారికి స్వేచ్ఛ అధికంగావున్నది. వారేమిచేసినా మనం తప్పుపట్టక వారి కణగివుండవలెను. సృష్టిలోవున్న సమస్తజంతువులున్ను ఆడవి మొగ వాటికి లోబడివుండడం నైజం.

సీత—రేపు నీకు పెళ్ళయి నీమొగుడు వేళకు యింటికిరాక తిప్పలుపెడితే నీవప్పుడేమి చేస్తావు?

సుభ—అతడు యింటికి వచ్చేవరకూ శాంతంవహించి కని పెట్టుకుని వుంటాను.

సీత—యితరులవిషయంలో మాట లెన్నైనాచెప్పవచ్చును. స్వవిషయంలో మాత్రం చెప్పినట్టు నడుచుకోవడం బహుకష్టం. తన విషయంలో యెదటివారు నేరంచేసినప్పుడు నీవుచెప్పిన శాంతమూ గీంతమూ అవతలకు నడుస్తవి. నీకునిజంగా మగడువచ్చి యీప్రకారంగా నిన్ను బాధపెట్టినప్పుడు నీవెంతశాంతం వహిస్తావో మేము చూడకపోములే.

సుభ—నేను వివాహం చేసుకోకముందే మగడికి లోబడి వుండడం నేర్చుకుంటాను. నాశాంతం నీకు కనపర్చడాని కయినా నేను శీఘ్రంగా వివాహ మాడుతాను—అడుగో లక్ష్మణుడు వస్తూవున్నాడు. నీభర్తకూడా వెనుక వస్తూవుండి వుండవచ్చును.

[పెద్దలక్ష్మణుడు ప్రవేశించుచున్నాడు]

సీత—నీయజమానుడుగా రెంత దూరములో వున్నారు?

పెద్దల—నాయజమానుడు నాకుజానెడు దూరంలోవున్నాడు; ఆయనచేతులు మరీచేరువకు వచ్చినవి. రెండుచేతులూ దబదబ నాతలమీద పడ్డవి. ఇవిగో నాదౌడలుకూడా సాక్ష్య మిస్తూవున్నవి చూడు. (అని వంగి దౌడచూపుచున్నాడు)

సీత—నీగీర్వాణము కట్టిపెట్టి తెనుగుతో చెప్పు. ఆయన నీతో మాట్లాడినారా? నీవాయనమనస్సు కనిపెట్టినావా?

పెద్దల—ఆయనమనస్సంతా నాశిరస్సుమీద కనపడ్డది. ఆయనమనసేమోకాని చెప్పినమాట వక్కటినాకు తెలిసిందికాదు.

సుభ—నీకర్థం తెలియకుండా అతడంత అస్పష్టంగా మాట్లాడినాడా?

పెద్దల—కావలసినంత స్పష్టంగానే మాటలాడినాడు; నాతలమీద దెబ్బలు మరింత స్పష్టంగా కనపడ్డవి. ఆడినమాటలుమాత్రం నాకర్థం కాలేదు.

సీత—ఆయన యింటికి వస్తూవున్నారేమో చెప్పు. ఆలస్యంగా వస్తే భార్యకేమయినా కోపంవస్తుందని సందేహిస్తూవున్నారని తోస్తుంది.

పెద్దల—ఏసందేహమూ లేదు. నీభర్తకు పిచ్చియెత్తింది.

సీత—ఓరినిర్భాగ్యుడా! పిచ్చియెత్తిందీ!

పెద్దల—పిచ్చికాకపోతే వెఱ్ఱి. యేదోవకటియెత్తింది. తప్పకుండా నీమొగుడికి మతిపోయింది. నేను యింటికి భోజనానికిరమ్మంటే నావెయివరహాలూ యేమిచేసినా వంటాడు; నేను భోజనసమయమయ్యా అంటే, తాను నాసొమ్మంటాడు; అన్నం చల్లారిపోయిందంటే, నీచేతి కిచ్చినధనం తెమ్మంటాడు; అతనికి డబ్బుపిచ్చయెత్తింది. అమ్మగారు కనిపెట్టుకోని వున్నారయ్యా అంటే, నేనేఅమ్మగారినీ యెరగను నీఅమ్మగారిని తీసుకువెళ్ళి తగలబెట్టి రమ్మన్నాడు.

సుభ—ఎవరన్నారు?

పెద్దల—యెవరా? నాయజమానుడున్ను నీబావగారున్ను

అయిన వసంతకుఁడుగారు. నేను యిల్లూ యెరగను పెళ్ళాన్నీ యెరగను యేమీయెరగను పొమ్మన్నాఁడు. నేను నోటితో మీావర్తమానం తీసుకుని వెళ్ళితలతో కావలసినన్ని దెబ్బలు మీాకు ప్రత్యుత్తరంతీసుకుని వచ్చినాను.

సీత—నిర్భాగ్యుఁడా! నీవు మళ్ళీవెళ్ళి నీయజమానుణ్ని యింటికి తీసుకుని రా.

పెద్దల—మళ్ళీవెళ్ళి మళ్ళీ దెబ్బలుం తిని రావడానికా? యిఖ నేను వెళ్లను. యీాసారి మరివకరిని పంపు.

సీత—మాఉమాటాడకుండా వెళ్ళు వెళ్ళకపోతే నీతల బద్దలుకొడతాను.

పెద్దల—యివేళ మీాయిద్దఱిమధ్యనూ నాతలకాస్తా పగిలిపోతుంది. పగలకుండా వుండడానకి దేవుడు నాకు యినపతలనయినా పెట్టినాడు కాడు.

సీత—ఆట్టేవాగక వెళ్ళిపో నీయజమానుణ్ని వేగిరం తీసుకురా.

పెద్దల—వెళ్ళితీసుకురమ్మని యిక్కడ నీవు తన్నుతావు; వెళ్ళి యీామాటలు చెపితే అతడు అక్కడ తన్నుతాడు. మీాయిద్దరి మధ్యనూ నాకు చావు వా)సింది. యీామాటు నేను చావకుండా బ)తికివస్తే నావంటిమీాఁద చర్మంవుండదు. (అని వెళ్ళుచున్నాఁడు.)

సుభ—ఛీ! వూరుకో నీమొగంచూస్తే నీవు బొత్తిగా ధైర్యము లేనిదానివలె కనపడుతూవున్నావు.

సీత—నేను యింట్లో ఆయనకోసం కనిపెట్టుకొని వుండి మాడుతూవుండగా, మరి యెవత్తో ఆయనదావున జేరి సంతోషిస్తూ వుంఃటే నే నెట్లా సహించి వూరుకోగలను? నా మొగంకాంతి తరిగి

వాడబారినట్టు కనపడుతూవుంటే దాని కతఁడే కారణము. నా మొగం నిజంగా సౌందర్యం చెడి చిన్నపోయివుంటే; అతడు మళ్ళీ వచ్చి వక్కసారి చల్లనిచూపు చూడడంతోటే నాముఖం యథాప్రకారంగా అవుతుంది.

సుభ—నీవు లేనిపోనిఅనుమానం వకటి మనసులో పెట్టుకొని వృథాగా ఖేదపడుతూ వున్నావు. నీఅనుమానం వదిలిపెట్టు.

సీత—మానాభిమానాలు లేనివాళ్ళు యిటువంటిసంగతులు లక్ష్యంచెయ్యక వూరకుండగలరుగాని నేనెలాగు వోర్చివుండగలను? నేనెఱుఁగుదును; ఆయనదృష్టి నిశ్చయముగా మరియెవ్వతెమీఁదనో పారింది. లేకుంటే, యింతసేపాయన యింటికి రాకుండా యెందుకు వుంటారు? నాకోసం చేయిస్తూవున్న చంద్రహారం యీదినం తీసుకు రాకుండా రానని నాతోచెప్పివెళ్ళినారు. ఆయన నంనుచేతనే యింటికి రాకుండావున్నా రనుకుందా మంటే, నేను వర్తమానం పంపించి నప్పుడు తనకు భార్యా అక్కరలేదని యెందుకు కోపపడుతారు? యిప్పుడు నాసౌందర్యం ఆయనకు హృదయరంజకముగా లేనందున, యీప్రకారంగా నేను దుఃఖిస్తూనే ప్రాణం విడుస్తాను. (అని యేడ్చుచున్నది.)

సుభ—నీవంటి తెలివిమాలినవాళ్ళేమీ లేనిదే వట్టిజారత్వ శంక పెట్టుకొని తిన్నగా సుఖంపలేక తీరి కూర్చుండి యేదో మనోవ్యథ బెట్టుకొని కృశిస్తూవుంటారు. వాడు చెప్పినమాటలు నిజమో అబద్ధమో కనుక్కొని నీమొగుణ్ణి వెంటఁబెట్టుకొని వస్తాము రా.

(అని యిద్దఱును వెళ్ళుచున్నారు)

ద్వితీయరంగము—సత్రపువీధి

[చిన్నవసంతుఁడు ప్రవేశించుచున్నాఁడు]

చిన్నవసం—(తనలో) నేను లక్ష్మణుని చేతికిచ్చినసొమ్ము జాగ్రత్తగా నున్నదనియు, వాఁడిదివఱ నాఁక సత్రమువద్ద నేకనిపెట్టుకొనియుండి యిప్పుడే నాకోసర మావలకు వెళ్ళినాఁడనియు, సత్రాధికారి చెప్పుచున్నాఁడు. ఇతఁడు చెప్పినమాటలను బట్టిచూడఁగా మొట్టమొదట నేను సొమ్మిచ్చి పంపినవరువాత లక్ష్మణుఁడు నాతో మాటాడనట్టే కనఁబడుచున్నది. అదుగో లక్ష్మణుఁడును వచ్చుచున్నాఁడు.

[చిన్న లక్ష్మణుఁడు ప్రవేశించుచున్నాఁడు]

ఏమి? ఇప్పుడు నీ వెనుకటిధోరణి యేమయిన మాఱినదా? ఇంకను అలాగుననే యున్నదా? నీకు దెబ్బలు కావలసియున్న పక్షమున, నాతో మరల పరియాచకములాడుము. నీవు సత్రము యెఱుఁగవు కాదా? నీచేతికి నేను సొమ్మేయియ్యలేదు; మన్నింటికి భోజనమునకు పిలుచుకొని రమ్మని నిన్ను మీయమ్మగారు పంపినారు; నా యిల్లు మంగళవారపు పేటలో నున్నది. ఇంత మతిలేకుండ నాతో మాటాడుటకయి నీకేమయిన మతిభ్రమ కలిగినదా యేమి?

చిన్నల—నా వెనుకటిధోరణి యేమిటి? ఆప్రకారంగా మీతో నేనెప్పుడు మాట్లాడినాను?

చిన్నవసం—ఇంతకుముందే — ఇంకను గడియైనను కాలేదు.

చిన్నల—మీరుసొమ్మిచ్చి నన్ను సత్రమువద్దకు పంపినది మొదలుకొని మళ్ళీ నేను మీ మొగమునైనా చూడలేదు.

చిన్నవసం—ఓరి దుర్మార్గుఁడా! నేను నీచేతికి సొమ్మేయియ్యలేదన్నావు; ఎవరో అమ్మగారనియు భోజనమనియు చెప్ప మొదలుపెట్టినావు. నాకు కోపము తెప్పించినందుకు ఫలము నీకనుభవమయినదా?

చిన్నల—మీకు యీలాగు పరమానందం యెత్తుకొన్నందుకు నాకు బహుసంతోషంగా వున్నది. ఈహాస్యాని కర్థమేమో నాకు తెలిసిందికాదు. దయచేసి విప్పిచెప్పండి.

చిన్నవసం—నన్నింకను మరల నెగతాళి చేయుచునేయున్నావా? మీదిమిక్కిలి నేనే నీతో హాస్యమాడుచున్నానని యెదురు నామీదనే నేరము వేసెదవా? అర్థమిదిగో విప్పి చెప్పెదను పట్టు.

(అని కొట్టుచున్నాఁడు.)

చిన్నల—దైవంతోడు. వూరుకోండి. మీహాస్యంఅంతకంతకు ముదురుపాకంలో పడుతూవున్నది. నేనేమి నేరంచేసినానని నన్ను మీరీప్రకారంగా కొట్టినారు?

చిన్నవసం—కొంచెము చనువిచ్చి నీతో నేనప్పుడప్పుడు వేళాకోళాములాడుచు వచ్చుచున్నానని నన్నులోకువచేసి సమయముగుర్తెఱుఁగకుండ నెక్కడచూచిననక్కడ నేనాతో పరిహాసములకు మొదలుపెట్టి నన్ను బొత్తిగా తెలివితక్కువ వానిక్రింద కట్టివేసినావు. ఏపని చేసినను సమయమెఱిఁగి మఱిచేయవలెను. ప్రతికార్యమునకును కర్తసమయ మొకటి యుండును. ఆసమయ మెఱుఁగక అసమయములో చేసినపని యేదియు రాణించదు. నీవిఁకముందు నాతో నెప్పుడయిన హాస్యమాడ తలఁచుకొన్నపక్షమున, నామనసు కనిపెట్టి మఱి హాస్యము చేయుము. లేకున్న నీనెత్తి వాఁచుఁగొట్టి నీవు సమయజ్ఞత నేర్చుకొనునట్లు చేసెదను.

చిన్నల—నేను జన్మం యెత్తినతరువాత యెప్పుడున్నూ యీామెతో మాట్లాడలేదు.

చన్నవ—ఈబిడ కేమో దేవతావేశ ముండిననేకాని యీామె మనలను పేరులుపెట్టి యేలాగున పిలువఁగలిగినది?

సీత—యజమానుడున్నూ సేవకుడున్నూ యేకమయి యేదో మాయవేషం వన్నుకొని ఆడుదాన్ని నన్ను నిష్కారణంగా యేడిపించడం మీాకున్యాయంకాదు. ఓప్రాణనాయకా! నీవు కల్పవృక్షము వంటివాడవు. నేను నీసమీాపమున నాటిన మల్లికాలతవంటిదానను. నీమీాద అల్లుకోవడానికి నాకువక్కతెకే క్రమమైనస్వతంత్రంవున్నది. నేను నిన్నుచుట్టుకొని వున్నప్పుడే నీకు శోభ యెక్కువగా వుంటుంది. కల్పవృక్షా న్నంటుకొని మఱి యేతీగైనా పెరిగితే అది బదనికగాని మఱివకటికాదు. అది వున్నట్టేవుండి క్రమక్రమముగా తా నాశ్రయించి వున్నదాన్నే నిస్సారంచేసి నాశనం చేస్తుంది. కాఁబట్టి అటువంటిది పుట్టడంతోటే మొదలంటా తీసివెయ్యవలెను.

చిన్నవ—ఈమె నాతోనే మాటాడుచున్నదా? ఈచెప్పెడి దంతయు నావిషయమేనా? నేనీమెను స్వప్నములో వివాహమాడినానా యేమిటి? లేక నేనిప్పుడు నిద్రపోవుచుండి యీామె చెప్పెడు మాటలు వినుచున్నానా? న న్నేభూత మావహించినదోకాని నా కన్నులను చెవులనుగూడ మోసము చేయుచున్నది! ప్రత్యక్షముగా జరుగుచున్న యీాయింద్రజాల మేమో తెలిసికొనువఱకును నే నీమె మాటకు మాఱాడక లోఁబడి యూరకుండెదను.

సుభ—లక్ష్మణా! నీవువెళ్ళి వేగిరం వడ్డనచేసి యింటికాడ సిద్ధంగా వుండు మని చెప్పు.

చిన్నల—భూతభయం లేకుండా వుండడానికి నేను చిన్నప్పుడు

నేర్చుకున్నమంత్రం జపం చేసుకుంటాను. ఇది తప్పకుండా దయ్యాల దేశము. మేము దయ్యాలతోనూ, భూతాలతోనూ, పిశాచాల తోనూ, కామినీలతోనూ మాట్లాడుతూ వున్నాముగాని మనుష్యులతో మాటాడడం లేదు. మే మీరాక్షసులు చెప్పినట్టు వినకపోతే మమ్మల్ని పీడించి పీక్కుతింటవి.

సుభ—నీలో నీ వేమో ప్రేలుకుంటూ నేను చెప్పినదానికి బదులు చెప్పవేమి? ఓమంగా? మొద్దా! శిలా! నిన్నే మాటాడు.

చిన్నల—వీళ్ళు మంత్రశక్తిచేత నన్నేదో మరివకజంతువుగా మార్చివేసినారు. స్వామీ! నేనిప్పుడు నీకు లక్ష్మణున్నిగానే కనుపడుతూవున్నానా?

చిన్నవసం—నీవు నీలాగుననేవున్నావు. నేనును నాలాగుననే యున్నానని యెంచెదను.

చిన్నల—మనమిద్దరమూ మనస్సులోనూ రూపములోనూ కూడా మారిపోయినాము స్వామీ!

చిన్నవసం—నీరూపము యథాప్రకారముగానే యున్నది.

చిన్నల—లేదు. వీళ్ళు నన్నిప్పుడు కోతినిచేసిఆడిస్తూవున్నారు.

చిన్నవసం—నీవేజంతువుగానైనా మారినపక్షమున నీవు గాడిదవుగా మారినావుగాని మఱియొక జంతువుగా మారలేదు.

చిన్నల—అవును. వీళ్ళు నాచేత గడ్డితినిపించి నామీద యెక్కి సవారిచేస్తూవున్నారు. నేను గాడిదనే కాకపోతే వాళ్ళునన్ను యెరిగివున్నట్టే వాళ్ళను నేనున్ను యెరిగివుందును.

సీత—(చిన్నవసంతకుని చేయిపట్టుకొని) రండిరండి. యజమానుడున్నూ భృత్యుడున్నూ చేరి నన్ను వేళాకోళం చేస్తూవుంటే కంట్లో వేలుపెట్టుకొని యేడుస్తూ చూస్తూ వూరకుండడానికి నేను

వెళ్లిరాన్నికాను. భోజనానికి దయచెయ్యండి. (అని లాగుచున్నది) లక్ష్మణా! నీవు గుమ్మమువద్దవుండి నేనున్నూ నాప్రాణనాథుఁడున్నూ లోపల భోజనంచేస్తూవున్న కాలంలో యెవరినీ లోపలికి రానియ్యకు. నాభర్తగారికోసం యెవరైనావచ్చి నిన్ను తలుపుతియ్యమంటే, లోపల భోజనంచేస్తూవున్నారు తలుపు తియ్యడానికి వల్లకాదని చెప్పి పంపివెయ్యి. యెవరికయినా తలుపుతీస్తే నీతలకాయ బద్దలుకొడుతాన.

చిన్నల—వసంతికా! నేను గుమ్మంకాడ కావలివుండనా?

సీత—ఎవరినైనాలోపలికి రానిచ్చినావంటే తప్పకుండా నీ తల పగలకొడుతాను.

సుభ—వసంతకా! వేగిరం నడువు. ఇప్పటికే భోజనానికి చాలా ఆలస్యం అయింది. (అని యందఱును వెళ్ళుచున్నారు)

తృతీయాంకము

ప్రథమరంగము—వసంతుని గృహాము ముందు

[పెద్దవసంతకుఁడును, పెద్దలక్ష్మణుఁడును, విశ్వకర్మయును స్వర్ణకారుఁడును, కాంచనగుప్తుఁడను వర్తకుఁడును ప్రవేశించుచున్నారు]

పెద్దవసం—విశ్వకర్మా! నన్నిప్పుడువదిలిపెట్టవలెను. నేనింటి కాలస్యంగా వెళ్ళినప్పుడు నాభార్య మిక్కిలి కొఱకొఱలాడుచుండును. చంద్రహార మీపూట సిద్ధమగునేమోయని యింతసేపటి వఱకును మీయింట్లో నున్నాననియు, సాయంకాల మదిమెఱుఁగుపెట్టి తీసికొనివచ్చెదననియు నాభార్యతోచెప్పు—ఇక్కడ వీఁడొకఁడున్నాఁడు. వీఁడంగడివీధిలో నన్ను కలిసికొన్నాఁడఁట! నేను తన్ను

కొట్టినానట! తనచేతికేమో వేయివరాలనిచ్చినా నన్నానట!—ఓరి తాగుబోతా! నీ మాటలకర్ధమేమి?

పెద్దల—మీరు మీమనసువచ్చినట్టు చెప్పండి. నే నెఱిగిందేమో నే నెఱుగుదును. నన్ను మీరు తప్పకుండా కొట్టినారు.

పెద్దవసం—నీవు గాడిదవుగా కనపడుచున్నావు.

పెద్దల—మీచేత దెబ్బలుతిని వూరుకోవడంవల్ల నే నాలాగే కనపడుతూవున్నాను. గాడిదనైతే నేను మిమ్మల్ని తన్నవలసినది; అట్లా చేసినట్లయితే మీరు జాగ్రతగా వుందురు.

పెద్దవసం—తలుపు వేసియున్నది. మనలను లోపలికి రానిమ్మని పిలువు.

పెద్దల—ఓమాలీ! ఓడామోదారా! ఓరిరామా! ఎవరు లోపల? తలుపు తియ్యండి.

చిన్నల—(లోపలినుండి) యెవఁడురావాఁడు తెగ అరుస్తూ వున్నాఁడు? నీకేమి మతిపోయిందా యేమిటి? వెళ్ళిపో.

పెద్దల—తలుపువద్ద కావలివున్నవాడెవడో. మనప్రభువుగారు వీధిలో నిలుచున్నారు. వేగరం తలుపుతియ్యి.

చిన్నల—(లోపలినుండి) అతడు యెక్కడనుంచివచ్చాడో మళ్ళీ అక్కడకే నడవమను. వెళ్ళకపోతే నిలుచోలేక అతని కాళ్ళ నొప్పులు పెడతవి.

పెద్దల—ఆలోపల మాట్లాడేవారెవరో తలుపుతియ్యండి.

చిన్నల—(లోపలినుండి) మంచిది. నీవుయెందుకు వచ్చినావో చెప్పితే నేను చెప్పవలసినమాట తరువాత చెప్తాను.

పెద్దవసం—ఎందుకా? భోజనమునకు; నే నీదినమున భోజనము చెయ్యలేదు.

చిన్నల—ఈదినము నీకిక్కడ భోజనందొరకదు. మరి వక రోజురా.

పెద్దవసం—నీవెవఁడవు? నాయింటికి నన్ను రానీకున్నావు?

చిన్నల—ఈ వేళకు నేను కావలికాచేవాణ్ని నాపేరు లక్ష్మణుఁడు.

పెద్దల—ఓరిదొంగా! నాపనిమాత్రమేకాకుండా నాపేరు కూడా దొంగలించినావు! యీవేళకు లక్ష్మణుఁడవైతే మఱికొంత సేపటికి నీవు గాడిదవుకూడా అవుతావు.

సుధ—(లోపలినుండి) లక్ష్మణా! గుమ్మముదగ్గిర ఆఅల్ల రేమిటి? కేకలువేసేవారిని పంపివెయ్యి.

పెద్దవసం—ఎవఁడురా? ఎంతపిలిచినను తలుపుతీయకున్నాఁడు

చిన్నల—(లోపలినుండి) ఎంతచెప్పినా పోకుండా గుమ్మంకాడ కేకలువేసేవా రెవరురా?

పెద్దవసం—నేను వసంతకుఁడను. తలుపుతీయుము.

చిన్నల—(లోపలినుండి) వసంతకుఁడు సీతతో లోపల భోజనము చేయుచున్నాఁడు. నేను తలుపుతియ్యను వెళ్ళిపో.

పెద్దవసం—(తనలో) వసంతకుఁడు సీతతో లోపల భోజనము చేయుచున్నాఁడేమి! నాభార్యతో లోపల మఱియెవ్వఁడో యున్నాఁడు! (బిగ్గరగా) లక్ష్మణా! గునపము తీసికొనిరా.

పెద్దల—తలుపు బద్దలయ్యేటట్టుగా గట్టిగా గుద్దండి.

పెద్దల—కాదుకాదు గునపము తీసికొనిరా తలుపు బద్దలుకొట్టి లోపలికి వెళ్లుదము.

చిన్నల—(లోపలినుండి) ఏది తలుపు బద్దలుకొట్టు. నేను తలుపు బద్దలుకొట్టినవాడితల బద్దలుకొడుతాను.

కాంచ—శాంతము వహించుము. అటువంటిపని యెన్నడును చేయఁబోకుము. అట్లు చేయుటచేత నీవేరవ్వపడి యింతవఱకును నీభార్య విషయమయి మంచియభిప్రాయముగలజనులకందఱికినిసందేహము కలిగించినవాఁడ వగుదువు. నీవేమియు అనుమానపడఁబోకుము, నీభార్య మిక్కిలి బుద్ధిమంతురాలనియు, గుణవంతురాలనియు, మహాపతివ్రత యనియు, చిరకాలానుభవమువలన నీకు తెలిసియేయున్నది. ఇప్పుడు తలుపు తీయకపోవుటకును కారణమేమో అవల నీకామె మెల్లగా విన్నపము చేయును. నామాట విని శాంత మవలంబించుము మనమందరమును గలిసి యీపూట ప్రభావతిగారియింట భోజనము చేయుదము రండి. సాయంకాలము నీ వొంటరిగావచ్చి తలుపుతీయ నందుకు కారణమడిగి తెలిసికొందువుగానిలే. ఇప్పుడు నీవు బలవంతముగా తలుపు బద్దలుకొట్టి లోపలికి వెళ్ళినపక్షమున జనులు దానికనేకార్థములు చేయుదురు; అందుచేత నీవు పోయినతరువాతకూడ అపకీర్తి శాశ్వతముగా నుండిపోవును.

పెద్దవసం—నీవింతగా చెప్పుచున్నావుగనుక నీమాట విని మరలెదను. ప్రభావతి మిక్కిలి యోగ్యురాలు; బహు చమత్కారముగా సంభాషించును; భోజనమునకు వెళ్ళినవారిని మిక్కిలిఆదరణ చేయును. అవును మన మక్కడకు భోజనమునకు వెళ్ళుదము.—విశ్వకర్మా! ఈనాటికి చంద్రహారము సిద్ధమయి యుండవచ్చును; నీ వింటికివెళ్ళి వేగిరము నావద్దకు తీసికొనిరా. నాభార్య యీప్రకారముగా నవమానపరిచినదిగనుక దానిని వంచనచేయుటకయి యీచంద్రహారమును ఊరకేయైనను ప్రభావతికిచ్చెదను. వేగిరము వెళ్లు.

విశ్వ—నాలుగు గడియలలోపల చంద్రహారమును తీసికొని వచ్చి మిమ్ము కలిసికొనెదను.

పెద్దవసం—ఆలాగున చేయుము. నన్నీ ప్రకారముగా పరిభవించినందుకు ధననష్టమున కయిన నొప్పించెదను.

(అందఱును వెళ్లుచున్నారు.)

ద్వితీయరంగము గృహమునందలి వీధిసావడి.

[సుభద్రయు చిన్నవసంతకుఁడును ప్రవేశించుచున్నారు.]

సుభ—వసంతకా! నీవీప్రకారముగా పెనిమిటి కుండవలసిన ధర్మమును మఱచిపోవచ్చునా? నాఅప్పగారిని ధనం నిమిత్తమే పెండ్లాడిన పక్షమున, ఆధనమునిమిత్తమయినా తిన్నగాచూడు. నీ ప్రేమ మరివకచోట వున్నపక్షమున, ఆపని దొంగతనంగా చెయ్యి. నీలోపల వున్నఅభిప్రాయం పయికి తెలియనియ్యక మనసులో నయినా దాచుకో. చల్లని నాపుమాచి, తియ్యగా మాట్లాడి, నీకృత్రిమము కనపడకుండా నైనా వుంచు. నీ మనసులో యేదోషంవున్నా పయికయినా వేషం బాగా వెయ్యి. చాటున నీయిష్టంవచ్చినట్లుచేసినా అది పయికి కనపర్చవలసిన అవసరం యేమున్నది? లోపల ద్రోహం చెయ్యడమే కాకుండా పయికికూడా అప్రియంగా మాట్లాడుతూ వుంటే, నీవు రెండుదోషాలు చేసినవాడవవుతావు. దుశ్చేష్టలుపరుష వాక్యములవల్ల రెట్టింపుగా బాధపెడతవి. అయ్యో! మా అప్పస్థితి చూస్తే నాకెంతో విచారంగా వున్నది! ఆడవాళ్ళముగనుక మేము యేమాట చెప్తితే ఆమాటలే నమ్ముతాము; మమ్మల్ని మాటలచేతనైనా సంతోషపెట్టి నిజంగా మామీద ప్రేమవున్నట్టయినా నటించరాదా? ఎలాగయినా లోపలికివచ్చి మాఅప్పగారికి ధైర్యంచెప్పి

వోదార్చి భార్యవని పిలువు. నీ మంచిమాటలవల్ల ఒకరిదుఃఖం పో గొట్టఁ గలిగినప్పుడు మనసులో లేనిది కొంచెంచెప్పడం పాపంకాదు.

చిన్నవసం—ఓ ప్రియురాలా! నాపేరు నీవెఱిఁగినను నీపేరు నే నెఱుఁగను గనుక నిన్నాలాగున పిలిచినందుకు క్షమించు. మాయ లును వేషములు నుపదేశించుటకు నీవు మహోపాధ్యాయురాలవుగాఁ గనఁబడుచున్నావు! మనసులో నొకటి యుంచుకొని పయికొకటి మాటాడుమని నాకు నేర్పుచున్నావా? సత్యమునే పలుకుట కల వాటుపడిన నా నిర్మలమయిన మనస్సును సత్యమునుండి మళ్ళించుట కయి. యేలవృథా శ్రమపడియెదవు? నీవు దేవుఁడయి నామనస్సును క్రొత్తగా సృష్టించఁగలశక్తి నీకు వచ్చినట్టయితే, అప్పుడు నా మతి మాఱునేమో గాని యిప్పుడు న్యాయమార్గమునుండి ఆవగింజంతయు మళ్ళదు. ఇప్పుడు నేనున్నప్రకారముగా నీ యప్పగారెంత కన్నుల వెంబడిని నీరు గార్చినను నాభార్యా కాదనియు, ఆమెను నే నెప్పు డును వివాహము చేసికోలేదనియు నేను దృఢముగా నెఱుఁగుదును. నా ప్రియురాలా! నీ యప్పగారి కన్నీటిసముద్రములో నన్ను ముంచి వేయుటకు ప్రయత్నింపకు. నీ వొకవేళ నిన్ను వరించుమని కోరిన యెడల నే నొప్పుకొందును. నీ ముంగురులను ఉరిత్రాళ్ళతో నన్ను కట్టివేయుము, నే నిప్పుడు నిన్ను భార్యగా పరిగ్రహించి నీకుబద్ధుఁడ నయి యుండెదను.

సుభ—నీకు పిచ్చియెత్తిందా యేమిటి? అలాగున మాట్లా డుతూ వున్నావు!

చిన్నవసం—నాకు పిచ్చియెత్తలేదుగాని కొంతవఱకు మతి భ్రమించినది. ఎందుచేతనో మాత్రము నేను చెప్పలేను.

సుభ—ఆమతిభ్రమ నీదృష్టిదోషంవల్లనే సంభవించినది.

చిన్నవసం—అదృష్టిదోషము నీ చేరువనుండి సూర్యకాంతి వలె మిఱుమిట్లుగొలుపునీరూపమును జూచుటవలన నేసంభవించినది.

సుభ—నీవు నా కేసిచూడక యెవరి కేసిచూడవలెనో వారి కేసి చూడు. నీదృష్టిదోషం నిమిషంలో పోతుంది.

చిన్నవసం—ప్రియురాలా! చీఁకటివంక చూచుటకంటె కన్నులు మూసికొనుట యుత్తమము.

సుభ—'ప్రియురాలా!' అని నన్నెందుకు పిలుస్తావు? ఆ పేరుతో నా అప్పగారిని పిలువు.

చిన్నవసం—నీఅప్ప కేవలము సోదరియే.

సుభ—నాకు సోదరియే.

చిన్నవసం—కాదు నాకును. నీవే నాకు ప్రియురాలవు. నీవే నా ప్రాణమునకు ప్రాణమవు.

సుభ—ఇదంతా నాసోదరివిషయంలో వుండవలెను. ఇది వఱకు లేకపోయినా అలావుండవలెను.

చిన్నవసం—నాప్రియురాలా! నీవే నాప్రియురాలవని చెప్పు. నేను నీవాఁడను; నాప్రేమ నీమీఁదనున్నది. నా జీవితకాలమును నీతోఁ గడపెదను. ఇంకను నీకును వివాహము కాలేదు. నాకును వివాహము కాలేదు. నన్ను పాణిగ్రహణము చేసికొమ్ము.

సుభ—ఈపాటి యీమాటలుచాలించు. మాఅప్పనునీవద్దకు తీసుకవస్తాను. ఆమెతోమంచిమాటలాడి ఆమెనుసమాధానపఱుచు.

(అని వెళ్ళుచున్నది)

[లోపలినుండి చిన్నలక్ష్మణుఁడు ప్రవేశించుచున్నాఁడు]

చిన్నవసం—అదేమిలక్ష్మణా! అంత వేగముగా పరుగెత్తుకొని వచ్చుచున్నావు!

చిన్నలక్ష్మ—మీరు నన్నెరుగుదురా? నేను లక్ష్మణున్నేనా? నేను మీ సేవకుణ్ణేనా? నేను నేనేనా?

చిన్నవసం—నీవు లక్ష్మణుఁడవే. నీవు నా సేవకుఁడవే. నీవు నీవే.

చిన్నల—నేను గాడిదను; నేను ఆడదాని దాసుణ్ణి నేను నేను కాను.

చిన్నవసం—ఆడుదాని దాసుఁడవెట్లయినావు? నీవు నీవు కాకపోవుటయేమి?

చిన్నల—దేముడితోడు. నేను నేను కాను. నేనొక స్త్రీ వాణ్ణి—ఎవత్తో నామీద పడుతుంది; నాదగ్గరకు వస్తుంది; నన్ను తనవాణ్ణంటుంది.

చిన్నవసం—నీ వేలాగున తనవాఁడవన్నది?

చిన్నల—నన్ను మృగం క్రింద కట్టివేసి నన్ను తనవాణ్ణిగా చేసుకొన్నది. నేను పశువునని నా అభిప్రాయం కాదు; అది శుద్ధపశువు గనుక దానికి మొగుణ్ణయితే నేను పశువును కాకపోతానా?

చిన్నవసం—అది యెటువంటిది?

చిన్నల—బహు పెద్దమనిషి. పగలు చూస్తే రాత్రి కలలోకి వస్తుంది, అది కట్టుకున్న బట్టలు బండెడు కర్రలు పెట్టి తగలబెట్టినా తగులడవు. దాని వంటినున్న చమురుతో యీ పూరంతా అయిదు రోజులు దీపాలు వెలిగించుకోవచ్చును.

చిన్నవసం—అది బహు యోగ్యురాలా?

చిన్నల—పెద్దమనిషి అంటే నా అభిప్రాయం అది కాదు. అది పొడుగెంతో వెడల్పు అంతేవున్నది. అది భూదేవివలె గుండ్రంగా వున్నది. దాని పేరు గౌరట!

చిన్నవసం—అదియే భూదేవి యయిన పక్షమున పర్వతము లెక్కడనున్నవి?

చిన్నల—పిఱుదులే పెద్దపర్వతాలు.

చిన్నవసం—మరి సముద్రములేవి ?

చిన్నల—కళ్ళూ చెవులూ మహాసముద్రాలు.

చిన్నవసం—నదులేవి ?

చిన్నల—రోమకూపాలలోనుంచి వచ్చేచెమట వెయ్యినదుల పెట్టుగా వున్నది.

చిన్నవసం—అడవులేవి ?

చిన్నల—తలంతా యీతరుప్పలాగువుండి మహారణ్యంగా కనపడుతుంది. ఆగ్రామదేవత, అనూకాలమ్మ, ఆరాక్షసి నన్ను తన మొగుడంటుంది; నాపేరుపెట్టి పిలుస్తుంది; నన్ను కౌగలించుకోవచ్చే టప్పటికిభూతమని జడిసి తప్పించుకొని పారిపోయివచ్చి యివతలఁబడి ప్రాణాలు దక్కించుకున్నాను.

చిన్నవసం—ఇఁక మన మిక్కడ నుండఁగూడదు. తత్క్షణము వెళ్ళి యెంత కేవునకయినను సరే యొకబండిని కుదుర్చుకొనిరా. మన కెంత చచ్చుపెడ్లబండి దొరకినను, ఈరాత్రి మన మీగ్రామములో నిద్రచేయఁగూడదు. నీవు మరల వచ్చినదాఁక నేనంగడివీధిలోతిరుగు చుండెదను. వేగిరమువచ్చి నన్ను కలిసికో. ఈ గ్రామములోని వా రందఱును మనల నెఱిఁగియు మన మొక్కరినిఎఱుఁగకయున్నప్పుడు మన మతిశీఘ్రముగా మూటయుముల్లెయుకట్టుకొని లేచిపోవలసినదే.

చిన్నల—పెళ్ళామనని నన్నుపట్టుకొన్న బ్రహ్మరాక్షసి చేతులోనుంచి తప్పించుకోవడం గలిగితే పెద్దపులినోట్లోనుంచి తప్పించుకొన్న లేడిలాగు పరుగెత్తుతాను. (అని వెళ్లుచున్నాఁడు.)

చిన్నవసం—(తనలో) ఈపట్టణములోదయ్యాలపోతులుతప్ప మఱి యెవ్వరును కాపుర ముండరు. కాఁబట్టి యీయూరు విడిచి నే

నెంత వేగిరము వెళ్ళిన నంతమంచిది. నన్ను మగఁడని పిలిచిన దాని పేరు దలఁచుకొన్న నాదేహము కంప మెత్తుచున్నది. అయినను సౌదర్యరాశి యైనయామె చెల్లెలుమాత్రము తన మృదుమధుర వాక్యములచేతను విలాసముచేతను హావభావాదులచేతను నామనస్సును తనవశము చేసికొన్నది.

[చంద్రహారముతో విశ్వకర్మ ప్రవేశించు చున్నాఁడు.]

విశ్వ—వసంతకా!

చిన్నవ—అవును నాపేరు వసంతకుఁడే.

విశ్వ—ఆసంగతి నాకు బాగా తెలుసును. ఇదుగో మీరు తెమ్మన్నచంద్రహారము. మెఱుగుపెట్టడం వేగిరం కాకపోవడంచేత యింత సేపాలస్య మయింది.

చిన్నవ—నీయిష్ట మేమి? నేనిది యేమి చెయ్యను?

విశ్వ—మీకోసం చేసినాను మీయిష్టం వచ్చినట్టు చేసుకోండి.

చిన్నవ—నాకోసరమే చేసినావా? నే నెప్పుడును చేయుమన లేదే.

విశ్వ—ఒకమాటు కాదు; రెండుమాట్లు కాదు; యిరవై మాట్లు చెప్పినారు. ఇది మీయింటికి వేగిరం పట్టుకొనివెళ్ళి మీ భార్యను సంతోషపెట్టండి. నేను సాయంకాలం భోజనంవేళకు మీ యింటికి వచ్చి దీనిసొమ్ము పట్టుకువెళుతాను.

చిన్నవ—కొంచెము సేపుండి సొమ్మిప్పుడే పుచ్చుకో లేకపోయినపక్షమున నీకు చంద్రహారమును నేనుకూడ మరల కనపడము.

విశ్వ—(చిఱునవ్వు నవ్వి) నాసొమ్మెక్కడికీ పోదు. మీరు మహాచిత్రమయినమనుష్యులు. నేనిప్పుడు వెళ్ళిపోతాను.

(అని వెళ్ళుచున్నాఁడు.)

చిన్నవ—(తనలో) నా కీమాయయేమో తెలియకుండనున్నది. ఇంత మంచిచంద్రహారము నూరక యిచ్చెదనన్నప్పు డెంత తెలివితక్కువవాఁడును తన కక్కఱలే దనఁడు. ఈప్రకారముగా వీథులలో బంగారుగొలుసులు దొరకుచున్నప్పుడు, ఇక్కడ నెవ్వరును కష్టపడనక్కఱలేదు. నేనంగడివీథికి వెళ్ళిలక్ష్మణునికొఱకయియెదురు చూచుచుండెదను. వాఁడు బండి కుదుర్చుకొని వచ్చినపక్షమున, అక్కడనుండియే వెళ్ళిపోయెదను. (అని వెళ్లుచున్నాఁడు.

చతుర్థాంకము.

ప్రథమరంగము—పురవీథి.

[ఒకవర్తకుఁడును, విశ్వకర్మయు, ఒకరాజపురుషుఁడును ప్రవేశించు చున్నారు.]

వర్త—నేను నీకు సొమ్ము బదులిచ్చి సంవత్సరము దాటిపోయినది. అప్పటినుండియు నేను నిన్నేమియు సొమ్మునిమిత్తమయి తొందరపెట్టలేదు. నేనిప్పు డకస్మాత్తుగా హస్తినాపురమునకు వెళ్ళవలసినపని తటస్థించి యవశ్యముగా సొమ్ము కావలసివచ్చినదిగాని లేనిపక్షమున నేనిప్పుడురహితము సొమ్మునిమిత్తము నిన్నింత నిర్బంధపెట్టకయేపోదును. కాఁబట్టి వెంటనే సొమ్మిచ్చివేయుము. లేనిపక్షమున, ఈరాజపురుషుఁ డిప్పుడు నిన్నుపట్టుకొని ధర్మస్థానమునకు తీసికొని వెళ్లును.

విశ్వ—నేను నీకు బాకీవున్నంతసొమ్మే నాకు వసంతకుఁడు యివ్వవలసివున్నది. నిన్ను కలుసుకోవడానికి ఒకగడియముందే నే నతనికి చంద్రహారం యిచ్చినాను. అయిదుగంటలవేళ నాకతఁడు సొమ్ము యిచ్చివేస్తాడు. నన్ననుగ్రహించి ఒక్కపర్యాయము నీవతని యింటిదాకా నాతోకూడా వస్తే నీసొమ్ము నీకిచ్చివేసి నాపత్రం నేను పుచ్చుకుంటాను.

[పెద్దవసంతకుఁడును, పెద్దలక్ష్మణుఁడును ప్రవేశించుచున్నారు.]

రాజపుర—మీా రాయనయింటికి వెళ్ళవలసినవేళ తప్పి పోయింది. అడుగో వసంతకుఁడే యిలాగు వస్తూవున్నాఁడు.

పెద్దవ—నేను కంసాలియింటికి వెళ్లెదను; ఈలోపుగా నీవంగడికివెళ్ళి పేకబెత్త మొకటికొని తీసికొనిరా. నన్ను మధ్యాహ్నము లోపలికి రాకుండ తలుపు వేయించినందుకయి నీయజమానురాలిని, తలుపు తీయనందునకయి పరివారమును, శిక్షింపవలెను. అడుగో విశ్వకర్మ వచ్చుచున్నాఁడు. నీవు వేగిరము వెళ్ళి బెత్తము కొని యింటికి పట్టుకొనిరా.

పెద్దల—ఒక్కబెత్తము కాదు; మీాకు కావలిస్తే వెయ్యి బెత్తాలుకొని తీసుకువస్తాను. (అని వెళ్ళుచున్నాడు.)

పెద్దవ—నిన్ను నమ్ముకొన్నవాఁడు చక్కఁగా నేబాగుపడును. నేను నీకొఱకును చంద్రహారముకొఱకును నీమాటను నమ్ముకొని యెంతోసేపు కాచుకొనియున్నాను. ఎంతసేపు కనిపెట్టుకొనియున్నను నీజాడగాని చంద్రహారముజాడగాని కనపడలేదు. చంద్రహారము వేగిర మిచ్చినపక్షమున నీతో పని యుండదని మొగము చాటువేసి నావా యేమి?

విశ్వ—మీహాస్య మిప్పుడు మానివెయ్యండి. బంగారం యెంతయెత్తో యేవన్నో, కూలి యెంతో, అంతా పద్దువ్రాసి యిదుగో తెచ్చినాను. మీరు యివ్వవలసినమొత్త మంతా నేనీయన కివ్వవలసినదానికంటె మూడురూపాయలు యెక్కువగా వుంటుంది. ఈయన దూరదేశము వెళ్ళవలసి యీసొమ్ముకోసమేనిలిచివున్నాఁడు. వేగిరం సొమ్మిచ్చి మమ్మల్ని పంపివెయ్యండి.

పెద్దవ—ఇప్పుడు నేను సొమ్మిక్కడకు తీసికొని రాలేదు; అంతేకాక నాకు గ్రామములోకొంచెముపని యున్నది. నీవీయనను మాయింటికి తీసికొనివెళ్ళి, చంద్రహారము నాభార్యచేతికిచ్చి నే నిమ్మన్నానని సొమ్మడిగి పుచ్చుకో. ఒకవేళ నేనును మీరక్కడ నుండఁగానే రావచ్చును.

విశ్వ—అలాగయితే చంద్రహారము మీరే తీసుకు వస్తారా?

పెద్దవ—నేను తీసికొని వెళ్ళను. ఒకవేళ నేను వేగిరం రాక పోదునేమో నీవే తీసుకొని వెళ్ళు.

విశ్వ—మంచిది నేనే తీసికొని వెళుతాను. చంద్రహారం యిప్పుడు మీదగ్గిర వున్నదా?

పెద్దవ—నాదగ్గఱ లేకపోయిన నీదగ్గఱ నున్నది. ఇప్పుడునీవద్ద లేనిపక్షమున సొమ్ము లేకుండ నీవు మరల వచ్చినదారిని వెళ్ళవలసి వచ్చును.

విశ్వ—దయచేసి చంద్రహారం వేగిరం యియ్యండి. ఈయన సిద్ధంగా ప్రయాణం కట్టుకొనివచ్చినాఁడు. ఆలస్యంచేస్తే ముహూర్తం మించిపోతుంది. వేగిరం పంపించనందుకుయీాయననన్ను దూషిస్తారు.

పెద్దవ—సరి! సరి! వ్యవహారము చక్కఁగానే కుదిరినది. అన్నప్రకారముగా చంద్రహారము నీవు తీసికొనిరానందునకయి నేను

కూకలు వేసిపోదు నని తప్పించుకొనుటకై నీవీపన్నుగడ పన్నినావు. నీవు ముందుగానే యుఅచుట కారంభించనియెడల, వేళకు తీసుకొని రానందునకు నేను నిన్ను తిట్టుదు ననుకొన్నావా?

వర్త—కాలము వ్యర్థముగాపోవుచున్నది. శీఘ్రముగా నన్ను పంపివేయవలెను.

విశ్వ—ఆయన నన్నేలాగుతొందర పెడుతున్నారో విన్నారా? చంద్రహారము—

పెద్దవ—కంఠశోష యెందుకు? నాభార్యచేతి కిచ్చి సొమ్ము పుచ్చుకో.

విశ్వ—రండిరండి. ఇంతకుమునుపే మీచేతికి చంద్రహార మిచ్చినానుగదా? ఆచంద్రహారమయినా లేకపోతే మఱివకవస్తువు యేదైనా ఆనవాలిచ్చి పంపండి.

పెద్దవ—ఛీ పో. నీవు నరస మతివిస్తారము చేయుచున్నావు. చంద్రహార మెక్కడ నున్నది! ఏదీ నన్ను చూడనిమ్ము.

విశ్వ—నాకవతల కావలసినంతపనివున్నది. యీప్రకారంగా మీతో పరాచకము లాడుతూ కూర్చోవడానికి నాకు తీరుబడిలేదు. నాకు మీరు సరియైనప్రత్యుత్తరం యిస్తారా యివ్వరా? లేకపోతే మిమ్మల్ని యీరాజపురుషుడికి వప్పగిస్తాను.

పెద్దవ—నీకు నేను ప్రత్యుత్తర మియ్యవలెనుగా! ఏమని ప్రత్యుత్తర మిమ్మన్నావు?

విశ్వ—చంద్రహారంనిమిత్త మీరు నాకివ్వవలసినసొమ్మిచ్చి వెయ్యండి.

పెద్దవ— నీవు చంద్రహారమిచ్చినదాంక నీకు నేనుసొమ్మియ్య నక్కఱలేదు.

విశ్వ—గడియ నేపటిక్రింద మీ కిచ్చి వేసినాను.

పెద్దవ—నీవు నాకియ్య లేదు; నీ వామాటయే మరల మరల ననుచుండుటవలన నా గౌరవమునకు లోపము తెచ్చుచున్నావు.

విశ్వ—లేదనడంవల్ల నాపరపతికే మీరు భంగం కలిగిస్తూవున్నారు. మీమాట నిజమనితోస్తే నా కెక్కడయినా పరపతి పుడుతుందా?

వర్త—ఓయి రాజపురుషా! క్రమప్రకారముగా నీ వీ కంసాలిని పట్టుకో.

రాజ—దొరతనమువారి యుత్తరవుప్రకారముగా నీవు ధర్మస్థానమునకు నడువు. తిరుగుబాటుచేస్తే నీకు శిక్ష అవుతుంది.

విశ్వ—యిందువల్ల నాకుమానభంగంవస్తుంది. నాబదులుగా సొమ్మివ్వడాని కయినా నప్పుకోండి. లేకపోతే నాపరువు పోయేటప్పుడు మీపరువుమాత్రం వుంచుతానా? భత్యంయిచ్చి మిమ్మల్ని కూడా యీరాజపురుషుడిచేత పట్టుకునేటట్టు చేస్తాను.

పెద్దవ—నాకియ్యని వస్తువునకయి సొమ్మిచ్చుటకు నే నెన్నండయిన నొప్పుకుందునా? ఓ బుద్ధిహీనుండా! నీ చేతనైనపక్షమున నన్నుకూడ పట్టుకొనునట్లు చేయుము.

విశ్వ—ఓరాజపురుషా! నీ భత్యం యిదుగో నా ఫిర్యాదు ప్రకారంగా ఈయనను పట్టుకొని న్యాయస్థానమునకు తీసుకోపిరా. ఇంత బహిరంగముగా నన్నవమానపరచినందుకు ఈయన మర్యాద మాత్రము నేను నిలుపుతానా?

రాజ—ఇతని అభియోగము మీరు విన్నారా? మీరు కూడ ధర్మస్థానమునకు నడవండి.

పెద్దవ—నేను జామీనిచ్చువఱకును నీకు లోబడియెదను.—

ఓరీ! నీదు కాణములో నున్న బంగారమంతయు ఈవ్యవహారముతో పోయి నీకు ముష్టిచెంబు చేతికి వచ్చునులే.

విశ్వ—కనీలే. మీ బెదరింపు చూదాము. ఈపట్నం రాజు యేలుతూవున్నాఁడుగాని ముండ యేలడం లేదు. వ్యవహారంలో గెలిచి మీవద్ద వడ్డీతో కూడా సొమ్ము పుచ్చుకుంటానుగాని వదిలి పెట్టను.

[చిన్నలక్ష్మణుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

చిన్నల—మథుర వెళ్ళడానికి బండి సిద్ధంగా వున్నది; నేను మీకోసం మంచిబండి కుదిర్చి వచ్చినాను. మీరు రావడమే అవశిష్టం. సెలవయితే మనసామాను బండిలో వేయిస్తాను.

పెద్దవ—నీకు పిచ్చి యెత్తినదా యేమి? మథుర వెళ్ళుటకే బండి సిద్ధముగా నున్నది?

చిన్నల—మీరు నన్ను కుదుర్చుకుని రమ్మన్న బండి.

పెద్దవ—నీవు త్రాగుబోతువుగా కనఁబడు చున్నావు! నిన్ను బెత్తము తెమ్మని పంపినాను.

చిన్నల—కాదండి. మీరు నన్ను బండికోసమే పంపినారు.

పెద్దవ—ఇప్పుడు నీతో వివాదమాడుటకు నాకు తీఱదు. నేను చెప్పినమాటలు తిన్నగా వినుచుండుటకై తరువాత నీకు బుద్ధి చెప్పెదను. మాఱుమాటాడక తిన్నగా సీతయొద్దకు వెళ్ళి, ఈతాళపుచెవి దానిచేతికిచ్చి, నగలపెట్టెలో పట్టుగుడ్డతో కట్టినరూపాయలమూట వేగిరము నేనిమ్మన్నానని చెప్పి పట్టుకొనిరా రాజభటులు నన్ను పట్టుకొన్నారనియు, ప్రాతిభావ్య మియ్యనియెడల నన్ను కొట్టులో పెట్టుదురనియుఁ జెప్పు. మాఱుమాట చెప్పక పరుగెత్తు—రాజపురుషా! సొమ్ము వచ్చులోపల మనము మెల్లఁగా నడచుచుందము;

రమ్మా. (వర్తకుడును, విశ్వకర్మయు, రాజపురుషుడును, పెద్దవసంత కుడును వెళ్ళుచున్నారు.)

చిన్నల—సీతయింటికా మళ్ళీ వెళ్ళడము! అక్కడికివెళితే గారి నన్ను మొగుణ్ణని మళ్ళీ పట్టుకుంటుంది. ఈమాటు దాన్ని వదిలించుకొని రాలేను. నాకు యిష్టం లేకపోయినా వెళ్ళుమన్నచోటికి వెళ్ళక తప్పదు. సేవకు లెప్పుడూ పరాధీనులు. (అని వెళ్ళుచున్నాడు)

ద్వితీయాంకము — పెద్దవసంతకుని గృహమందు.

[సీతయు, సుభద్రియు, ప్రవేశించు చున్నారు.]

సీత—సుభద్రా! ఆయన విన్నాప్రకారంగా నీమీద మోహంకనపటిచేమాట లన్నారా? ఆయన మనస్ఫూర్తిగానే ఆలా గన్నారో, లేక హాస్యానికే అన్నారో చూపులవల్లనూ ముఖచేష్టల వల్లనూ నీవు బాగాకనిపెట్టినావా? ఆయన గంభీరంగా చూచినాడా? తెల్ల తెల్ల పోయి చూచినాడా? మొఖం విచారంగా వున్నదా? సంతోషంగా వున్నదా! అతనిమన స్సేమైనా ముఖలక్షణమునుబట్టి తెలుసుకో తగివున్నదో లేదో చెప్పు.

సుభ—అతడు మొట్టమొదట నీవు తనకు భార్యవే కావన్నాడు.

సీత—నన్ను వివాహమే చేసుకోలేదన్నాడుగా! ఏమిపాపము పండినదీ!

సుభ—అటుతరువాత తా నీవూరికి క్రొత్తవాణ్ణని ప్రమాణము చేసినాడు.

సీత—అంత అప్రమాణానికికూడా లోబడ్డాడుగా!

సుభ—అప్పుడు నేను నీపక్షంగా మాట్లాడినాను,

సీత—అతఁడేమిచెప్పినాఁడు?

సుభ—నీమీఁద ప్రేమ వుంచవలసిందని నేను వేడుకుంటే తాను నామీఁద ప్రేమ వుంచుతాననినన్ను వేడుకోమొదలుపెట్టినాఁడు

సీత—అతఁడు యేమిషమీఁద నిన్ను మోహిస్తా నన్నాడు?

సుభ—సౌభాగ్యుఁ డయినవరుఁ డొకవధువు నాశ్రయించినట్టు గానే. నాకేమిషా కనఁపడలేదు. అతఁడు మొట్టమొదట నాసౌందర్యము వర్ణించి, తరువాత నాసంభాషణ పొగడినాఁడు.

సీత—నీవు నాదగ్గర కపటంవిడిచే చెపుతూవున్నావా? నీ వేమైనా దురుద్దేశంతో—

సుభ—శాంతించు. నీ వలాగంటిమాట లనఁబోకు.

సీత—ఇంతవఱకు జరిగినతరువాత నేనేలాగు శాంతంవహించగలను? నామనసు వూరుకుందామన్నా నానోరు వూరుకుండదు. అతఁడు నీతిమాలినవాఁడు: క్రూఁరుడు; ద్రోహి; పాతకుడు; చండాలుఁడు; అతనిమొగం చూడరాదు.

సుభ—అటువంటివాడినినిమిత్తముయి ఆశపడడం యెందుకు? ఎవత్తోఅతని కాశపడ్డదని అనుమానపడడం యెందుకు? అటువంటి దుర్మార్గుఁడు వదిలిపోవడమే నీకు క్షేమం.

సీత—నామనస్సు నావాక్కువలె లేదు. నోరు తిడుతూవున్నా మనస్సు అతనికోసమే ఆశపడుతూవున్నది.

[చిన్నలక్ష్మణుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

చిన్నల—(రొఁజుచు) ఇదుగో తాళంచెవి. నగలపెట్టెలో రూపాయలమాట—వేగిరం పట్టుకు రా?

సుభ—ఆలాగున వగరుస్తున్నా వేమి?

చిన్నల—వేగిరం పరుగుత్తుకొని రావడంవల్ల.

సీత—నీయజమానుడెక్కడ? ఆయన సుఖంగా వున్నారా?

చిన్నల—లేదు. ఆయన చిక్కులో పడ్డాడు. యమకింకరుడి వంటివాడెవడో అతణ్ని పట్టుకొని తీసుకుపోతూ వున్నాడు; మెళ్ళో బిళ్ళ వున్నది; అక్కడికి వెళ్ళి మళ్ళీవదిలి రాను; నాకుభయం వేస్తూ వున్నది.

సీత—భయంవదిలి తిన్నగా చెప్పు ఏమిజరిగినది?

చిన్నల—ఏమిజరిగిందో నాకు తెలియదు. నాయజమానుణ్ని రాజపురుషుడు పట్టుకొని తీసుకుని వెళుతూ వున్నాడు.

సీత—ఏమిా! ఆయనను పట్టుకున్నారా? ఎవరిఫిర్యాదుమిాద?

చిన్నల—ఎవరి ఫిర్యాదుమిాద పట్టుకున్నారో నాకు బాగా తెలియదు. ఆయనను రాజభటుడు తీసుకుని వెళుతూ వున్నాడు. నాకది బాగా తెలుసును. విడుదల కావడానికి నగలపెట్టెలో వున్న సొమ్ము నీవు యిస్తావా లేదా?

సీత—సుభద్రా! పెట్టెతాళం తీసి రూపాయలమూట పట్టుకొనిరా. (అని తాళముచెవి యిచ్చుచున్నది.)

సుభ—(పుచ్చుకొని) ఇప్పుడేవస్తాను. (అని వెళ్ళుచున్నది.)

సీత—అద్భుతంగావున్నది! నాకు తెలియకుండా ఆయన అప్పెక్కడ చేసినారు? ఏదైనా పత్రం వ్రాసి యిచ్చినారా?

చిన్నల—పత్రం కాదు నగ-నగ.

సీత—యేమినగ?

చిన్నల—నా కదంతా నీతో చెపుతూ కూర్చోవడానికి అవకాశం లేదు. వేగిరం వెళ్ళవలెను. నేను యిందాకా బయలుదేరే టప్పటికే రెండుఘంటలయింది; ఇప్పుడప్పుడే వంటిఘంట వేసినారు.

సీత—యేమి? నీకోసం కాలం వెనక్కు పోతూవున్నది.

కాబోలును! నేను యిదివర కెప్పుడూ రెండుఘంటలు వేసినతరువాత వంటిఘంట వెయ్యడం వినలేదు.

చిన్నల—రాజభటులు పట్టుకుంటే తప్పకుండా కాలమంతా మారిపోతుంది.

సీత—కాలానికి రాజభటులఆజ్ఞ యేమిటి?

చిన్నల—నీవు వినలేదా యేమిటి? రాజభటులను చూస్తే దొంగ వెనక్కు పారిపోతాడు. కాలమూ దొంగవంటిదే. అది యెవ్వరికీ తెలియకుండా మెల్లిగా వచ్చివున్నట్టేవుండి మనుష్యులనే యీలోకంలోనుంచి యెత్తుకుపోతుంది. అలా దొంగతనం చేసేటప్పుడు రాజభటులను చూస్తే కాలంమాత్రం వెనుకకు పోదా?

[రూపాయలమూటతో సుభద్ర ప్రవేశించుచున్నది.]

సీత—లక్ష్మణా! అదుగో రూపాయలమూట. జాగ్రతగా తీసుకునివెళ్ళి తక్షణం నీ యజమానుణ్ని వదిలించి యింటికితీసుకునిరా. సుభద్రా! నామనసులో యెలాగో వున్నది. లోపలకువెళుదాము రా.

(అని వెళ్లుచున్నారు.)

చిన్నల—(తనలో) దేవుడా! వీళ్ళచేతులలో పడక యిప్పటికి బ్రతికి యివతల పడ్డాను. ఇక యిక్కడ నిలవకుండా పరుగెత్తుతాను.

(అని వెళ్లుచున్నాడు.)

తృతీయరంగము—ఒకవీధి.

[చిన్నవసంతకుడు ప్రవేశించుచున్నాడు.]

చిన్నవసం—(తనలో) నన్నెప్పుడో యెఱిగినవారివలెనే యిక్కడివారందఱును నాకు దండము పెట్టుచున్నారు; అందఱును నన్ను పేరుపెట్టి పిలిచి పలుకరించుచున్నారు; కొందఱు నాకు సొమ్మియ్య వచ్చుచున్నారు; కొందఱు భోజనమునకు పిలుచుచున్నారు;

కొందఱు తమకు నేను చేసినయుపకారముస కని వందనములు చేయు చున్నారు; కొందఱు కొనుటకయి మంచిమంచివస్తువులను దెచ్చి చూపు చున్నారు. ఇంతకుమునుపే యొకకుట్టుపనివాఁడు నన్ను తన యింటికి పిలుచుకొనిపోయి, నానిమిత్తమయి కొన్నవని కొన్నిపట్టు గుడ్డలనుచూపి, నాశరీరమునుబట్టి కొలఁత పుచ్చుకొన్నాఁడు. ఇదం తయు చూడఁగా నీపట్టణములో మళయాళమంత్రగాండ్రు తప్ప మఱి యెవ్వరును కాపుర ముండనట్టు కనఁబడు చున్నది.

[చిన్నలక్ష్మణుఁడు ప్రవేశించు చున్నాఁడు.]

చిన్నల—నన్ను తెమ్మనిపంపిన రూపాయ లివిగో; మీ రా యమదూతను వదల్చుకున్నారా?

చిన్నవ—ఇవి యెక్కడి రూపాయలు? ఏయమదూత?

చిన్నల—యమలోకంలో వుండే యమదూత కాదు; భూలో కంలోవుండే యమదూత. సన్నపాటివులిచర్మం మెడలో వేసుకుని వూళ్ళోవాళ్ళప్రాణాలన్నీ తీస్తాడూ—అతఁడు. ఇందాకా పిశాచం లాగున మిమ్ము పట్టుకొని తీసుకు వెళుతూ వున్నాఁడు.

చిన్నవ—నీమాట లేమియు నాకు తెలియు లేదు.

చిన్నల—ఇదే తెలియులేదా? నాకు స్పష్టంగా తెలుస్తూ వున్నవి. మెళ్ళోతోలికి వెండిబిళ్ళ వేసుకొనితిరుగుతాడు; అప్పుపుచ్చు కొని యెగఁబెట్టినవాళ్ళనూ, నేరాలు చేసినవాళ్ళనూ, తన కేమీ యివ్వనివాళ్ళనూ పట్టుకుంటాడు. అతణ్ణి మీరు యెరగరా?

చిన్నవ—రాజభటుఁడని నీ యభిప్రాయమూ యేమి?

చిన్నల—అవు నతఁడే.

చిన్నవ—నీపిచ్చిమాటలింతటితో కట్టిపెట్టు. ఈదినమున వెళ్లెడి బండి యేదైనదొరకినదా? మనమీరాత్రిప్రయాణమైవెళ్ళవచ్చునా?

చిన్నల—బండికుదిరి సిద్ధంగా వున్నది. మీ దేఆలస్య మని రెండుగడియలక్రిందనే మీతోవచ్చి చెప్పలేదా? అప్పుడు బంట్రోతు మిమ్మల్ని తీసుకు వెళుతూవుండడంచేత తొందరలోవుండి తిన్నగా జవాబు చెప్పినారు కారు. మిమ్మల్ని విడుదల చేయించుకోవడానికి తెమ్మన్నరూపాయ లివిగో.

చిన్నవ—వీని మతిపోయింది. నేనును మతిపోయిన వాని వలెనే కనపడుచున్నాను. మే మిక్కడ మాయలలోపడి తిరుగు చున్నాము. మాపాలిటి భాగ్య దేవతవచ్చి మ మ్మీయాపత్సముద్రములోనుండి పయికి లేవఁదీసి గట్టున పడవేయ వలెనుగాని మా యంతట మేము లేవలేము.

[ప్రభావతి ప్రవేశించుచున్నది.]

ప్రభా—వసంతకా! మంచిసమయానికి కనపడ్డావు. నీకు కంసాలి కనపడ్డట్టున్నాడు. అదేనా నాకిస్తానన్న చంద్రహారము?

చిన్నవ—పిశాచమా! నన్ను మోసముచెయ్యక వెళ్ళిపో.

చిన్నల—అయ్యా! ఈమె పిశాచమా?

చిన్నవ—ఈమె పెనుభూతము.

చిన్నల—ఈవిడ భూతాలకన్నిటికీ ముత్తవతల్లిలాగు కనపడు తూవున్నది.

ప్రభా—యివేళ యజమానుడున్నూ సేవకుడున్నూకూడా మహా ఉల్లాసంగావున్నారు! నాతోవస్తారా? సాయంకాలంకూడా మాయింట్లోనే భోజనము చేస్తురుగాని.

చిన్నల—వెళ్ళవద్దు. వెళితే యీదయ్యం మనల్ని పట్టుకుని వదలదు; మెల్లకాలం పీల్చి పిప్పిచేస్తుంది.

చిన్నవ—ఓసి దయ్యమా! నన్ను భోజనమునకు రమ్మను

చున్నావా? నేను రాను వెళ్ళిపో. నీవు దయ్యాలపోతువు.

చిన్నల—అలాగయితే మనకేదో దయ్యాన్ని పంపుచేస్తాంది, మంత్రిం పారకుండా పళ్ళు పీకించి వెయ్యవలెను.

ప్రభా—మీరు మధ్యాహ్నం భోజనాలవేళ పుచ్చుకొన్న నా వుంగరం నాకిచ్చివెయ్యండి. వెళ్ళిపోతాను; లేకపోతే నావుంగరం లోని వజ్రానికి బదులుగా మీరిస్తానన్న చంద్రహార మయినా యివ్వండి. నేను వక్కనిముషం యిక్కడవుండను.

చిన్నల—దయ్యా లెక్కడయినా కుంభం పొయ్యవలసినదనీ దిగదుడుపు పెట్టవలసినదనీ కోరుతవిగాని నగలు పెట్టమని కోరవు. ఈచండి దురాశా పాతకురాలు గనుక చంద్రహారం తెమ్మంటూ వున్నది.

ప్రభా—మాటాడరేమి? మీరు మంచివారు; మోసం చెయ్యరు; నావుంగరమైనా చంద్రహారమయినా యేదోవకటి యియ్యండి.

చిన్నవ—ఓసి శిఖండీ! నా దేహము మండుకొనిపోవుచున్నది. మాటాడక వెళ్ళిపో—లక్ష్మణా! మనము వెళ్ళుదమురా.

చిన్నల—మంచివారికి మాటాడక పోవడమే మందని కాలికి బుద్ధి చెప్పడం చూచినావా?

(అని యిద్దఱును పరుగెత్తుచున్నారు.)

ప్రభా—(తనలో) సందేహంలేకుండా వసంతకుడికి పిచ్చి యెత్తింది; లేకపోతే యీప్రకారంగా మాట్లాడడు? నలభయివరహాలు చేసే నావుంగరం పుచ్చుకొని వానికి బదులుగా చంద్రహారం యిస్తానన్నాడు. ఇప్పుడు రెండింట్లో యేదీ లేదంటూవున్నాడు. ఇంతేకాకుండా మధ్యాహ్నం భోంచేసేటప్పుడు తన్ను లోపలికి రాని

య్యకుండా తనయింటితలుపులు వేసినారని పిచ్చికథవకటి చెప్పినాడు. యితనిపిచ్చ తెలుసుకొని పెళ్ళాము బుద్ధిపూర్వకంగానే తలుపులు వేయించి వుండును. నే నిప్పుడు తిన్నగా అతనియింటికి వెళ్ళి పిచ్చ చేత నాయింట్లో ప్రవేశించి బలవంతముగా నావుంగరం యెత్తుకొని పోయినాడని పెళ్ళాముతో చెప్పివస్తాను. యీసంగతి చెప్పితే నా వుంగరంపోయినా దానివెల నలభై వరహాలయినా వస్తవి.

(అని వెళ్ళు చున్నది.)

చతుర్థరంగము—వసంతకుని గృహసమీపమున వీధి

[పెద్దవసంతకుడును, ఒకరాజభటుడును ప్రవేశించుచున్నారు.]

పెద్దవ—నీ వేమియు భయపడనక్కఅలేదు; నేనుపారిపోను; సాయంకాలములోపల నే నియ్యవలసినసొమ్మిచ్చి నిన్ను పంపెదను. ఈదినమున నాభార్య నామీద కొంచెము కోపముగా నున్నది. అందుచేత నేను పంపినవర్తమానము వేగిరము నమ్మినది కాదు కాబోలును! ఈపట్టణములో రాజభటులు నన్ను ఋణమునిమిత్త మయి పట్టుకొన్నా రన్నమాట యామెచెవులకు వింతగా వినబడి నమ్మనర్హము కానిదిగా నుండును.

బెత్తము పట్టుకొని యింతలో పెద్దలక్ష్మణుడు
ప్రవేశించుచున్నాడు.]

అడుగో నేను పంపినసేవకుడు వచ్చు చున్నాడు; అతడు సొమ్ము తీసికొని వచ్చియుండును—ఏమి? నేను తెమ్మన్నది తీసికొని వచ్చినావా?

పెద్దల—ఇదుగో బెత్తము తీసుకొని వచ్చినాను. (అని యియ్య బోవు చున్నాడు.)

పెద్దవ—ఇది కాదు. సొమ్మెక్కడ నున్నది?

పెద్దల—సొమ్ము నాదగ్గిర లేదు; బెత్తం కొన్నవాడి కిచ్చి వేసినాను.

పెద్దవ—ఓరి భ్రష్టుఁడా! బెత్తము కొన్నవానికి నాలుగు వందలరూపాయలమూట యిచ్చినావా?

పెద్దల—నాలుగువందలరూపాయలమూట యేమిటి?

పెద్దవ—ని న్నెందుకు పంపినాను?

పెద్దల—నన్ను బెత్తమునిమిత్తం పంపినారు; బెత్తం తెచ్చినాను.

పెద్దవ—తిన్నగా అడిగినమాటకు సదుత్తరము చెప్పనందుకిప్పు డీబెత్తము నీవీపుమీఁద విఱుగవలెను. (అనికొట్టుచున్నాఁడు.)

రాజభటుఁడు—మీరు కోపమాని శాంతం వహించవలెను.

పెద్దవ—ఆపదలో నున్నవాఁడను నేనా శాంతము వహించవలసినది?

పెద్దల—ఏమిటండీ? అలాగు—

రాజభ—పూరుకో; నోరుముయ్యి.

పెద్దల—నామీద కోపపడకపోతే ఆయనను కొట్టకుండా చెయ్యరాదా?

పెద్దవ—మొండిశిఖండీ! పరమనిర్భాగ్యుఁడా! నీకు తెలివి లేదురా?

పెద్దల—నాకు తెలివి తప్పివుంటే యీదెబ్బలు తెలియకనైనాపోను.

పెద్దవ—నీకు దెబ్బలు తగిలినవని తెలిసికొనుటలో తప్ప మఱియెందులోను నీకు తెలివి లేదు. నీవు గాడిదవు.

పెద్దల— నేనుగాడిదనే; యెంతవోఁడప్పు గలిగి పనిచేస్తూవున్నా నాకు దెబ్బలు తగులుతూ వుండడంచేత నేను గాడిదనే.

[సీతయు, సుభద్రయు, దుర్గాదాసనుమాంత్రికుఁడును
పరివేశించుచున్నారు.]

పెద్దవ—అదిగో నాభార్యవచ్చుచున్నది; ఎదురుగా వెళ్లుదము రండి,

పెద్దల—అమ్మా! చేతిలో బెత్తంచూచి జాగ్రతగా వుండు; దగ్గిరకు వస్తివా దెబ్బలు తగులుతవి. నాజ్యోతిషం నమ్మి దూరంగా వుండు;

పెద్దవ—నీవింకను నోరు మూసికొనవా!

(అని కొట్టుచున్నాఁడు.)

ప్రభా—నీవిప్పు డేమి చెవుతావు? నీ మొగుడు పిచ్చివా డవునా కాడా?

సీత—ఆయన చేస్తూవున్నదుర్మార్గం చూస్తే మరివకలాగు వూహించడానికి వీలు లేకుండా వున్నది.—దుర్గాదాసుగారూ!మీరు మంత్రవేత్తలుగదా? నా పెనిమిటిని పట్టుకున్నభూతాన్ని వదిలించి యథాప్రకారంవుండేటట్టుచేస్తిరా మీకుమంచిబహుమానంచేస్తాను.

సుభ—యెంతవికారంగా మనకేసి మెఱ్ఱబారి చూస్తూ వున్నాఁడో చూడు.

ప్రభా—అతికోపంచేత మెలావణకుతూవున్నాడో చూడు.

దుర్గా—నీచెయ్యి నాచేతికిచ్చి నాడి చూడనీ.

పెద్దవ—ఇదిగో చేయిచూడు. (అని చేయిచాపి) అవకతవక మాటలు ప్రేలినపక్షమున, ఈచెయ్యినీదాడశుద్ధిచేయును.జాగ్రత్త.

దుర్గా—చేతిలో భూతనాడి ఆడుతూవున్నది. ఈయన దేహ

న్నాశ్రయించి వున్నవో భూతమా! నీపేరు చెప్పి వేగిరం వదిలి పో. వేగిరం వదిలి వెళ్ళని పక్షానికి నామంత్రశక్తిచేత నిన్ను సీసాలో దింపి మారణహోమం చేస్తాను.

పెద్దవ—ఊరుకో దయ్యాలపోతా! వూరుకో నాకు పిచ్చ యెత్తలేదు.

దుర్గా—నేనెరుగుదును; మీకు పిచ్చ కాదు; మీ దేహాన్ని గ్రహంసోకి యిలా బాధపెడుతూ వున్నది. త్రిపురసుందరినైనా, భ్రమరాంబనైనా, జ్వాలానృసింహమునైనా, శరభసాళ్వమునైనా ప్రయోగించి నిమిషంలో మీకు గ్రహబాధలేకుండా చేస్తాను.

పెద్దవ—ఓరి పరమచండాలుఁడా! వీరందఱును నీకీప్రకార ముగా బోధించి నిన్నిక్కడకు తీసుకొని వచ్చినారా? ఈయేడుపు మొగపు నిర్భాగ్యురాలు తలుపులు బిగించి వేసి నన్ను లోపలికి రానియ్యక ఎవనినో లోపల పెట్టుకొని సిగ్గులేక నాయింట నేప్రకార ముగా భోజనము చేసినది?

సీత—ఓప్రాణనాథా! ఈమధ్యాహ్నం నీవు నాతో కలిసి మనయింట్లో భోజనం చేసిన సంగతి భగవంతుడికి తెలుసును; నాకు తెలుసును.

పెద్దవ—ఓసిగ్గుమాలినదానా! ఏమనుచున్నావు? నీయింట భోజనము చేసినానా?

పెద్దల—స్వామీ! నేను నిజం చెపుతాను. మీరు యీదినం యింటికాడ భోజనం చెయ్యలేదు.

పెద్దవ—ఇంటితలుపులు వేసి వెయ్యలేదా?

పెద్దల—అవును వేసివేశారు. నేను కళ్ళారా చూచినాను.

6 పెద్దవ—మన మొంక పిలిచినను తలుపు తియ్యలేదు కాదా?

పెద్దల——అవును. మనం యెంతపిలిచినా తలుపు తియ్యలేదు.

పెద్దవ——లోపలనుండికూడ నెవ్వరో తలుపు తీయవలదని కేక వేసినారు కారా?

పెద్దల——అవును. లోపలనుంచికూడా యెవరో తలుపు తియ్యవద్దని కేక వేశారు. నేను చెవులారా విన్నాను.

పెద్దవ——గుమ్మమువద్ద కావలి యున్నవాఁడు నన్ను తిరస్కరించి కానిమాట లాడలేదా?

పెద్దల——అవును గుమ్మంవద్ద కావలి వున్నవాడు మిమ్మల్ని తిరస్కారంచేసి మిగలమాట లాడినాడు.

పెద్దవ——నా కందుచేత కోపమువచ్చి గిరుక్కునమరలి నే నక్కడనుండి మఱియొకచోటికి పోలేదా?

పెద్దల——అవును అక్కడనుండి తత్క్షణం కోపంవచ్చి వెళ్ళిపోయినారు. ఆ హంశానికి నావళ్ళంతాసాక్ష్యంయిస్తూవున్నది. భార్యాగారిమీదవచ్చిన మీకోపం నావంటిమీద యెక్కడిపడితే అక్కడల్లా కనపడుతూవున్నది.

సీత——ఈయబద్ధాలలో నీవుకూడా యేకంకావడం కూడానా

దుర్గా——వాడికి సిగ్గూభిడియమూ లేదు. యజమానుణ్ని పిచ్చవాణ్నిచేసి మఱింత ఆడిస్తూవున్నాఁడు.

పెద్దవ——కంసాలివాఁడు నన్నుపట్టుకొనునట్లు చేయుటకు నీవు వానికి సహాయురాలవయినావా?

సీత——అయ్యో! నేనేపాపమూ యెరగను. ఇంకా మీరు నగల పెట్టెలోవున్న రూపాయులమాట యిమ్మన్నారని లక్ష్మణుఁడు వగరుస్తూ పరుగెత్తుకొనివస్తే మిమ్మల్ని విడిపించడానికి వెంటనే పొమ్మిచ్చి పంపినాను.

పెద్దల—నాచేతికి సొమ్మా! నాచేతికి చిల్లిగవ్వ యివ్వ లేదు—యీావిడ అన్నీ అబద్ధాలే ఆడుతూవున్నది. అయ్యా! ఈవిడె మాటలేమీ నమ్మబోకండి.

పెద్దవ—నీవు సొమ్మునిమిత్తము యింటికి వెళ్ళనైన వెళ్ళినావా?

సీత—వీడు నాదగ్గిరకువచ్చి అడిగినాడు; నేను సొమ్ము వీడి చేతిలో పెట్టినాను.

సుభ—నేనుచూస్తూవుండగా సొమ్ము వీడిచేతికిచ్చింది. నేనే పెట్టెతాళంతీసి రూపాయలమూట తీసికొనివచ్చినాను.

పెద్దల—ఓస్వామీ! నేను యేమీయెరుగను. నన్ను బెత్తం కొనడానికితప్ప మరెక్కడికీ మీరు పంపలేదు. నాకు దేవుడూ బెత్తం యిచ్చినవాడుతప్ప మరియెవరూ సాక్షులులేరు. ఆడవాళ్ళబద్ధాలాడ తారు; వాళ్ళను నమ్మరాదు.

దుర్గా—అమ్మా! నీ కీపిచ్చయేమిటి? యజమానుడికీ సేవకు డికీ యిద్దరికీకూడా దెయ్యంపట్టింది. వాళ్ల చూపులవల్లనే నాకంతా తెలిసింది. వీరిద్దరినీ పట్టుకొని చేతులూ కాళ్ళూకట్టి చీకటిగదిలో పెట్టవలెను.

పెద్దవ—ఈదినము నీవు నన్నెందుకు తలుపువేసి లోపలకు రానిచ్చినావుకావు?—ఓరీ! నీచేతికిచ్చినసొమ్ము నీవెందుకు తీసికొని వచ్చి యిచ్చినావుకావు?

సీత—ప్రాణేశ్వరా! నిన్ను వెలపలపెట్టి నే నెంతమాత్రము తలుపు వేయించలేదు.

పెద్దల—స్వామీ! నిజంగానే యీామె సొమ్ము నాచేతికియ్య లేదు. మనంయింటికి వెళ్ళినప్పుడు తలుపు వేయించిందని నేను

నిజం వప్పుకోవడంలేదా?

సీత—ఓరి పంచమహాపాతకుఁడా! నీవు రెండుసంగతులలోనూకూడా ఘోరమయిన అబద్ధమాడుతూవున్నావు.

పెద్దవ—ఓసి మాయలమారి జిత్తోత్తా! అన్నిసంగతులలోను నీ వబద్ధమాడుచున్నావు. నడివీధిలో నన్నవమానపఱుచుటయేకాక మీఁదిమిక్కిలి పీంర్రసండజీని కూర్చుకొనివచ్చి, సిగ్గులేక నాకేసి తేజిపాఱచూచుచున్నావా? ఈరెండుచేతులతోను నీగుడ్లు రెండును నూడఁదీసి క్రిందపెట్టెదను. (అని మీఁదికి వచ్చుచున్నాఁడు. అప్పు డిద్దఱునుగ్గు రతనిని పట్టుకొనుచున్నారు.)

సీత—పట్టుకోండి; పట్టుకోండి; నాదగ్గరకు రానియ్యకండి; కట్టిపెట్టండి.

దుర్గా—భూతావేశంచేతమాయిద్దరికీలొంగకుండావున్నాడు, మీరుకూడా సహాయుంరండి.

సుభ—అయ్యో! పాపము! అతఁడేప్రకారంగా. తెల్లపోయి వికారవుచూపు చూస్తూవున్నాడో!

పెద్దవ—ఏమి మీరందఱునుజేరి నన్ను హత్యచేసెదరా యేమి?—ఓ రాజభటుఁడా! నీకావలిలోనున్న నన్ను పీంర్రదండఱును కొట్టి విడిపించి తీసికొనిపోవుచుండఁగా చూచుచు నూరకుండెద వేమి?

రాజభ—అయ్యా! మీరీయనను వదిలిపెట్టండి. నాకావలిలో వుండఁగా మీరీయన నెవ్వరూ ముట్టుకోకూడదు.

దుర్గా—ఇతనికికూడా వళ్ళు తెలియకుండావున్నది: యితణ్ని కూడా పట్టుకొని కట్టిపెట్టండి. (ఇద్దఱు లక్ష్మణుని కట్టుచున్నారు.)

సీత—ఓయిరాజభటుఁడా! నీవెందుకడ్డంవస్తావు? పిచ్చివాడిప్రకారంగా బాధపడుతూ అందరినీ కొట్టఁబోతూవుంటే చూచి

డానికి నీకు సంతోషంగావున్నదా యేమిటి?

రాజభ—ఈయన నాకావలిలో వున్నాఁడు; ఈయనను వదిలిపెట్టితే యీయన బాకీవున్నసొమ్ము నేను యిచ్చుకో వలసి వస్తుంది.

సీత—బాకీమొత్తం యెంతో చెప్పినపక్షమున నేను యిచ్చివేస్తాను; ఆవిషయంలో నీవేమీ జడియనక్కరలేదు. నాతో యింటికిరా—ఓభూతవైద్యుఁడా! నీవుకూడా వెళ్ళియీయనను భద్రంగా లోపలిగదిలో పెట్టించు. ఈరోజు మాకు గొప్పదుర్దినము.

పెద్దవ—ఓసి పాపాత్మురాలా!

పెద్దల—నీమూలంగా నన్నుకూడా కట్టిపెట్టినారు.

పెద్దవ—చండాలుఁడా! నీవేనాకు పిచ్చియెత్తించుచున్నావు.

పెద్దల—వృథాగా మిమ్మల్ని కట్టిపెట్టితీసుకుని వెళుతూవుంటే లోబడివూరుకుంటారా? ఇదివరకు పిచ్చిలేకపోయినా యిప్పుడు పిచ్చెత్తించుకొని యీ దయ్యాలన్నీ హడిలి పారిపోయేటట్టు కేకలు వెయ్యండి.

సుభ—పాపము! యెంత అసందర్భంగా మాట్లాడుతూ వున్నారూ! వీరినిద్దరినీ దైవం రక్షించుగాక!

సీత—మీరీయిద్దరినీ యింటికి తీసుకువెళ్ళండి.—సుభద్రా నీవు నాతోవుండు. (దుర్గాదాసును;సహాయులును, పెద్దవసంతకుఁడును పెద్దలక్ష్మణుఁడును వెళ్లుచున్నారు.)

సీత—ఓయీ! యెవరిబాకీనిమిత్తం యీయనను పట్టుకున్నారు?

రాజభ—ఎవరో విశ్వకర్మ అనే కంసాలి బాకీనిమిత్తం నీ భామనిషిని యెరుగుదువా?

సీత—యెరుగుదును; బాకీమొత్తం యెంత ?

రాజభ—నూఱువరహాలు.

సీత—ఆసొమ్ము యెందుకోసం బాకీ వున్నారు ?

రాజభ—నీపెనిమిటి చేయించిన చంద్రహారం నిమిత్తం.

సీత—ఆయన నాకోసం చంద్రహారం చేయిస్తూ వున్నానని చెప్పినాడుగాని తీసుకుని రాలేదు.

ప్రభా—నీమొగుడు మధ్యాహ్నం కోపంతో మాయింటికి వచ్చి నావుంగరం పట్టుకొని వెళ్ళినాడు. ఇప్పు డాయన వేలిని వున్నది ఆవుంగరమే. ఆయనను వీధిలో చూచినాను.

సీత—అయివుండును. నేనుమాత్రం చంద్రహారం చూడ లేదు—ఓభటుడా! కంసాలి యెక్కడ వున్నాడో నావద్దకు తీసు కునిరా. నిజం అతనివల్ల కనుక్కొని సొమ్ము యిచ్చివేస్తాను.

[చేతిలో కత్తితో చిన్నవసంతకుఁడును, చిన్నలక్ష్మణుఁడును ప్రవేశించు చున్నారు.]

సుభ—హా! దైవమా! రక్షించు. వాళ్ళు మళ్ళీ వదల్చు కొని వీధిని పడ్డారు.

సీత—ఈసారి కత్తులు దూసుకొని వచ్చినారు. వారిని మళ్ళీ పట్టుకొని కట్టిపెట్టడానికి సహాయం రమ్మని అందరినీ పిలవండి.

రాజభ—పారిపొండి. వాళ్ళిద్దరూ మనను చంపివేస్తారు.
(రాజభటుఁడును, సీతయు, సుభద్రయు, పాఱిపోవుచున్నారు.)

చిన్నవసం—మనకత్తులు చూచి వారు బెదరినారు.

చిన్నవ—యిందాకా మిమ్మల్ని మొగుడని వెంబడించినది యిప్పుడు హడిలి మీదగ్గిరనుంచి పాఱిపోతూ వున్నది.

చిన్నవసం—ఇఁక మనకు భయము లేదు. సత్రమువద్దకు వెళ్ళి మనసామాను పట్టుకొనిరా. ఈరాత్రి బండియెక్కి వెళ్ళిపో వచ్చును.

చిన్నల—యీరాత్రికి మనం యిక్కడవున్నా వుండవచ్చును. వాళ్ళు మనకేమీ కీడు చెయ్యరు. వాళ్ళు మనతో అనుకూలంగా మాట్లాడుతూవున్నారు; మనకు బంగారం యిస్తూవున్నారు. ఈ వూళ్లోవాళ్ళందరూ నాకు బహుమంచివాళ్లుగా కనపడుతూవున్నారు. నన్ను మొగుడని పట్టుకొన్న ఆగ్రామదేవతమూలంగా గాని లేకపోతే యెల్లకాలమూ నాకు యీవూళ్ళోనే వుండవలెనని వున్నది.

చిన్నవసం—మనకు లక్షవరహాలు వచ్చినను నేనీరాత్రి యీ గ్రామములో నుండను. మనసామాను పట్టించుకొని వత్తమురా.

(అని యిద్దఱును వెళ్ళుచున్నారు.)

పంచమాకంము

ప్రథమరంగము—మఠసమీపమున వీధి

[వర్తకుఁడును, విశ్వకర్మయు ప్రవేశించుచున్నారు.]

విశ్వ—నామూలంగా మీప్రయాణం నిలిచిపోయినందుకు బహువిచారంగా వున్నది. అతఁడు శుద్ధఅన్యాయానికి వడిగట్టి యివ్వ లేదంటూవున్నా నే నతనిచేతికి చంద్రహారంయిచ్చినానని ప్రమాణం చేసి చెప్పగలను.

వర్తక—అతనికి యీపట్నంలో అంత గౌరవం యెందుచేత వచ్చినది?

విశం—అందరున్నూ అతణ్ని బహుగౌరవంగా చూస్తారు; అతను మహామంచివాడు; అబద్ధమన్నమాట అతనినోటినుంచి రాదు; అతని పేరు చెపితే యెంతపరపతి ఐనా పుడుతుంది. యీగ్రామంలో అతనితో సమానులు మరియెవరూ లేరు. యేరాత్రివేళ యేమనిషి చేత అతడు కాస్తవర్తమానం పంపినా తమధనంఅంతా అతణ్నినమ్మి పంపేటంత గురి అందరికీ అతనియందు వున్నది.

వర్త—మెల్లిగా మాట్లాడు; అడుగోఅతఁడు వస్తూవున్నాఁడు

[చిన్నవసంతకుఁడును, చిన్నలక్ష్మణుఁడును ప్రవేశించుచున్నారు.]

విశ్వ—అవును. అతఁడు తన కియ్యలేదని ప్రమాణముచేసిన దాచంద్రహారమే. అతఁడు దగ్గిరకు రానీ; అడుగుతాను—ఓవసంతకా! నాకీ అవమానమున్నూ శ్రమానున్నూ యెందుకు కలగచేసినావో నాకు అద్భుతంగా వున్నది; ఇప్పుడు మీరు యింత బహిరంగంగామెడలో వేసుకొని వీధిలో తిరుగుతూవున్న యీచంద్రహారము లేదనడము మీకుమాత్రం సిగ్గుచేటుకాదా? నన్ను వృధాగా నలుగురిలోనూ పరాభవపరచడమే కాకుండా యీపెద్దమనిషికికూడా లేనిపోనిఆయాసం కలుగచేసినారు. మనవివాదమూలంగా గాని లేకపోతే యీయన యీపాటి ప్రయాణమయి వెళ్ళివుండును. నావద్ద పుచ్చుకున్న చంద్రహారం యిది యిప్పుడు మీరు లేదనఁగలరా?

చిన్నవసం—అవునిది నీవే నాచేతి కిచ్చినావు కాఁబోలును! నీ వియ్యలేదని నే నీవఱ కేప్పుడును అనలేదే.

వర్త—అవును మీరు లేదన్నారు; లేదని అప్రమాణంకూడా చేసినారు.

చిన్నవసం—నేను లేదనుచుండఁగా గాని ప్రమాణం చెయ్యఁగాఁగాని యెవరు విన్నారు?

వర్త—నాయొక్క యీ రెండు చెవులున్నూ విన్నవి. ఇఁక మాటాడక వూరుకో పెద్దమనుష్యులలో తిరగనేర్చినవాడవు. యిటువంటి అబద్ధమాడి సిగ్గులేకుండా తగుదునని యెలాగు వీధులోతలయెత్తుకుని తిరుగుతూవున్నావు?

చిన్నవసం—నామీఁద అటువంటి దోషారోపణము చేయుటచేత నీవు పచ్చిదొంగవుగా కనఁబడుచున్నావు. మగవాఁడవయి నీవు నాతో దెబ్బలాటకు వచ్చిన పక్షమున, నాయథార్థతయు మర్యాదయు నీకు నిమిషములో కనఁబఱచఁగలను.

వర్త—తిరిగితే మొగంమీాదచెప్పు. నీవంతకంటెను దొంగవని నేను కనుపరుస్తాను. (వారు దగ్గఱకు వచ్చుచున్నారు.)

[సీతయు, సుభద్రయు, ప్రభావతియు, మఱికొందిఱును
ప్రవేశించుచున్నారు.]

సీత—ఆగు—అతని కేమీా హానిచేయకు—అతఁడు పిచ్చవాఁడు—కొండఱు ముందరికి వెళ్ళి చేతులొక త్రీలాగుకోండి—లక్ష్మణున్నికూడా పట్టుకొని కట్టిపెట్టి యిద్దరినీ మాయింటికి తీసుకునిరండి.

చిన్నల—అయ్యో! పరుగెత్తు పరుగెత్తు. అదుగో మఠం; అందులో దూరి తలుపులు లోపల వేసుకుందాము లేకపోతే వీళ్ళు మనని బ్రతకనియ్యరు.

(చిన్నలక్ష్మణుఁడును, చిన్నవసంతకుఁడును, మఠములోనికి వెళ్లుచున్నారు)

[మఠములోనుండివచ్చి యోగిని ప్రవేశించుచున్నది.]

యోగిని—జనులారా! అల్లరిచేయకండి మీారిక్కడ యెందుకు గుంపుగా చేరినారు?

సీత—మతిచాంచల్యం కలిగి నాపెనిమిటిని యిక్కడనుంచి తీసుకువెళ్ళడానికి మమ్మల్ని లోపలకు రానీ. మేమతణ్ని గట్టిగాకట్టి పెట్టి వైద్యంచేయించడానికి యింటికి తీసుకుపోతాను.

విశ్వ—ఈయనకు మతి చలించినదని యిదివరకేఅనుకున్నాను.

వర్త—ఈయనతో దెబ్బలాటకు సిద్ధమయినందుకునాకిప్పుడు విచారంగావున్నది.

యోగిని—యెంతకాలంనుంచి యితఁడీస్థితిలో వున్నాఁడు?

సీత—వారం దినములనుంచి యీాయన పరధ్యానంగానూ, విచారంగానూ, వ్యాకులంగానూవుండి వెనుకటికంటె యేమోాభేదంగా కనిపిస్తూవచ్చినారు. కాని యీరోజువరకూ యింతచేటులేదు. మరీ యీామధ్యాహ్నంనుంచీ వళ్లు తెలియకుండా లేచిపోయినారు.

యోగిని—అవశాత్తుగా యితనిధన మేమయినా విస్తారంగా పోయిందా? ఎవరైనా ప్రాణమిత్రుడు కాలంచేసినాడా? ఇతనిదృష్టి యెవత్తెమీాదికైనా పారి అక్రమంగా పరస్త్రీకోసం పరితపిస్తూవున్నాఁడా? వయస్సులో వున్నవాళ్ళు అందగత్తెఅయిన కొత్తదాన్ని చూడడంతోనే దానిమీాద కన్నువేసి సాధారణంగా పిచ్చియెత్తి తిరుగుతూవుంటారు. ఈమూాడింట్లో నీమొగుడి పైత్యభ్రమకు యేది కారణమయి వుండవచ్చును?

సీత—వకవేళ అయితే నీవు కడపట చెప్పినదితప్ప మరియేదీ కారణమయి వుండదు. ఈయన తరుచుగా యింటికాలస్యంగా వస్తూవుండడంచేత యెవతెవలలోనో పడి యిల్లూవాకలీ మరచి తిరుగుతూవున్నాడని వూహిస్తాను.

యోగి—ఆపని చేసినందుకయి నీవతణ్ని కూాకలు వెయ్యవలసింది.

సీత—నేనుమాత్రం మూరుకున్నానా? కూకలు వేస్తూనే వున్నాను.

యోగి—నీవు తగినంతగట్టిగా కూకలు వేసినట్లు తోచదు.

సీత—భార్య మొగుణ్ని కూకలువెయ్యతగినంత గట్టిగా కూకలువేస్తూనే వచ్చినాను.

యోగి—వక వేళరహస్యంగా కూకలు వేసేదానవు కాబోలును.

సీత — రహస్యంగా మాత్రమే కాదు; బహిరంగంగా కూడాను.

యోగి—అయితే చాలినంత కాదు.

సీత—అలాగయితే నిజం చెపుతాను. ఇఖ ఆయనతో నాకు రెండో ప్రసంగమే లేదు. రాత్రి పరున్నప్పుడు నిద్రపట్టిందాకా చెవి దగ్గిరచేరి యీసంగతినే గొణుగుతూ వుండేదాన్ని; భోజనమువద్ద కూడా యీసంగతి చెప్పకుండా ముద్ద మింగనిచ్చేదాన్నిగాను; మే మిద్దరమూ వంటిగావుంటే యిదితప్ప మరిఒకసంగతి మాటాడేదాన్ని కాను; అతడు పదిమందిలో వుండేటప్పుడయినా యీ ధోరణే తెచ్చి యెత్తిపొడువుమాట లంటూనే వుండేదాన్ని. నేను యెప్పుడూ యీ విషయమయ్యే చీవాట్లుపెడుతూ వుండేదాన్ని.

యోగి—నీవాడే మాటలమూలంగానే నీ మొగుడికి పిచ్చ యెత్తింది. లేనిపోనిఅనుమానం పెట్టుకొని అహోరాత్రములు చెవి దగ్గిర చేరి విరామం లేకుండా సాధిస్తూవుండే భార్యమాటలు వెఱ్ఱి కుక్కకాటుకంటెనూ యెక్కువవిషంగా వుండి యెటువంటి పరమ శాంతుడికయినా నిమిషంలో పిచ్చియెత్తిస్తవి; నీపోరుచేత అతడు రాత్రిళ్ళు నిద్రకుకూడా మొగంవాచినట్లు తోస్తుంది; రోజూ కలత నిద్రపోయేవాడికి మతి చలించిపోవడం అంతఆశ్చర్యం కాదు; నీవాడే

మాటలతో తిన్న అన్నం కడుపునపట్టక నీరయిపోయి వుండును. ఈ ప్రకారం నిద్రాహారాలు లేక యిల్లు అడివిగా నున్నప్పుడు యేరోగాలూ యెందుకు రాకుండావుంటవి ? జారత్వశంకచేత యిదంతా నీవు చేసుకున్న దోషఫలమే. కాఁబట్టి స్వయంకృతాపరాధము నీది నీవే అనుభవించవలెను.

సుభ—అతఁడు యెంత అక్రమంగా ప్రవర్తిస్తూవచ్చినాగానీ మాఅప్పమాత్రం అతణ్ని మంచిమాటలతోనే బోధిస్తూ వచ్చినది; అంతేగాని తూలుమాట యెప్పుడూ నోటరానియ్యలేదు—(మెల్లగా) ఆమెతప్పితే మంతా నీమీాదనేమోపి చివాట్లుపెడుతూవుంటేబదులు చెప్పకుండా వూరుకుంటావేమి ?

సీత—(మెల్లగా) ఆమె అంతా నానోటనే పలికించి నన్ను నోరెత్తకుండా చేసింది. నేనేమి చెప్పఁగలను? (బిగ్గరగా)—మీరు లోపలికి వెళ్ళి అతణ్ని పట్టుకోండి.

యోగి—మీరు యెవరూ లోపలికి వెళ్ళకూడదు,

సీత—అలాగయితే మీవాళ్ళ నెవళ్ళనయినా నాపెనిమిటిని యివతలకు తీసుకునివచ్చి నాకు వప్పగించుమను.

యోగి—అది వల్లగాదు. ఇది పవిత్రమయినమఠం గనుక అతడు దీనిలో శరణొందినాడు; అందుచేత నేను అతణ్ని మంచి మాటలతో స్వస్థచిత్తుణ్ని చేసేవరకూనీకువప్పగించను. నాప్రయత్నం వ్యర్థమయితే అప్పటిమాట చూతాము; యీలోగా వదలిపెట్టను.

సీత—నాపెనిమిటికి పరిచర్యచెయ్యడం నాకువిధిగనుక, నా పెనిమిటివద్ద నేనే కనిపెట్టుకునివుండి నేనే పథ్యపానాదులు పెట్టి వుపచారం చేస్తాను; మరివకరిని నమ్మి నేను అతణ్ని విడిచిపెట్టను; కాఁబట్టి నన్ను యింటికి తీసుకువెళ్ళనీ.

యోగి—కొంచెం శాంతించు. అతణ్ని మళ్లీ యెప్పటిమనిషిని చెయ్యడానికి మందులూ మూలికలూ మంత్రాలూ అన్నీ ప్రయోగించి నాశాయశక్తులా పనిచేసేవరకూ నేను అతణ్ని విడిచిపెట్టను. యోగినిని గనుక కష్టంలో వున్నవాళ్ళకు సహాయం చెయ్యడం నాకు ధర్మము. అతణ్ని యిక్కడ నావశంలో వుంచి నీవు వెళ్ళిపో.

సీత—నాపెనిమిటిని విడిచిపెట్టి నేను వెళ్ళను. మొగుణ్నీ పెళ్ళాన్నీ యెడబాపడం నీవంటి పుణ్యావ్రితంలో ప్రవేశించినదానికి ధర్మం కాదు.

యోగి—నే నతణ్ని వదలిపెట్టను; మాటాడక వెళ్ళిపో (అని లోపల తలుపు వేసికొనుచున్నది.)

సుభ—యీఅన్యాయం నీవురాజుతో వెళ్ళి మొఱపెట్టుకో.

సీత—వెళుదాముర్రా, నేను ఆయన కాళ్ళమీద సాష్టాంగ పడి, నాప్రార్థనలవల్లనూ కన్నీళ్ళవల్లనూ ఆయన మనసు కరిగించి స్వయంగా యిక్కడకువచ్చి యీయోగినిచేతులలోనుంచి నాపెనిమిటిని విడిపించి యిచ్చేవరకూ కాళ్లమీదనుంచి లేవను.

వర్త—యిప్పుడు దగ్గిరదగ్గిరగా అయిదుగంటలుకావచ్చింది. యింకా కొంచెంసేపటికి యీమఠంవెనకాల వున్నవధ్యభూమికి వెళ్లడానికి రాజుగారు స్వయంగానే యీదోవను వస్తారు.

విశ్వ—యెందుకోసము?

వర్త—యీపట్నంతాలూకు శాసనాలకు విరుద్ధంగా యీవూరికి వచ్చినందుకయి వక మధురాపురపువర్తకుణ్ని ముసలివాణ్ని వురి తీయించడానికోసము.

విశ్వ—అదుగో వారు వస్తూవున్నారు. అతణ్ని వురితియ్యడం స్థానం చూతాము.

సుభ—రాజు యీమఠం దాటి వెళ్ళకముందే నీవు ఆయన పాదాలమీద పడు.

[ధర్మపాలమహారాజును, సేవకులును, వర్ధమానుఁడును, గారాగృహాధికారియు, రాజభటులును ప్రవేశించుచున్నారు.]

ధర్మ—'ఏధర్మాత్ముఁ డయినను వచ్చి యీతనిప్రాణరక్షణార్థము ధనమిచ్చి పుణ్యము కట్టుకొన్నపక్షమున, ఈతనిని విడుదల చేయుదుము' అని మఱియొకసారి గట్టిగా చాటించు. మన మీతని కీపాటియుపకారమును జేయుదము.

సీత—ఓ మహాప్రభో! యీయోగిని నాకు చేసినఅన్యాయం విచారించి నాకు న్యాయం దయచేయించవలెను.

ధర్మ—ఆమె మిక్కిలి పుణ్యాత్మురాలు, బహుపూజ్యురాలు: నీవిషయములో నేమియు అక్రమము చేసియుండదు.

సీత—ఓమహారాజా! అనుగ్రహించి నామొరాలకించండి. వసంతకుఁడుగారు నాకు భర్త; యేలినవారుచేసిన నమ్మకములను బట్టి నేనాయనను వివాహం చేసుకున్నాను; నాదురదృష్టంచేత ఆయనకు యీరోజున అకాత్తుగా పైత్యభ్రమకనిపించి మాకుటుంబానికంతా గొప్పవిపత్తు సంప్రాప్తమయింది. ఏమికాలకర్మదోషం చేతనోకాని తనతోపాటు యేకకాలమందేపిచ్చియెత్తినతన సేవకుణ్ని వెంట వేసుకొని వూరిమీదపడి ఆయన కనపడ్డయిల్లెల్లాదూరి వుంగరాలూ నగలూ చేతికి యేదిదొరికితే అదెల్లాయెత్తుకువస్తూ అందరికి అప్రియంచేస్తూవున్నారు. వకపర్యాయం నేను ఆయనను కట్టిపెట్టించి యింటికిపంపించి, అదివరకాయన అక్కడక్కడ చేస్తూ వచ్చిన నష్టానికి సొమ్మునవరించి వారిని సమాధానపరుస్తున్నాను. ఆయన యెలాగోకాని తప్పించుకొని మళ్ళీవీధినిబడి తన సేవకుడును

తానున్నూ కత్తులు దూసుకొనివచ్చి మమ్ముతఱిమినారు. తరువాత మేము చాలామందిని సహాయంచేసుకొనివచ్చి మళ్ళీ కట్టిపెట్టడానికి వెంబడించేవరకు వారు పరుగుత్తుకొనిపోయి యీమఠంలో పడ్డారు. మేమాయనను యింటికి తీసుకుపోదామంటే యీ యోగిని మాకడ్డం వచ్చి తలుపులు లోపలవేసి మమ్ము లోపలికి వెళ్ళనూ వెళ్ళనియ్యదు; తానాయనను యివతలకు పంపనూపంపదు. దీనులమయిన మా మొఱ్ఱాలకించి దేవరవారేలాగయినా ఆమె వారిని యివతలికి పంపేటట్టు ఆజ్ఞ చేసి పతిభిక్ష పెట్టి రక్షించవలెను.

ధర్మ—విస్తారకాలముక్రింద నీభర్త మాయొద్ద నొక సేనానాయకుఁడుగా నుండి మాకు మిక్కిలి యుపకారము చేసినాఁడు. అప్పుడు నిన్నతనికి వివాహము చేయించి మేముచేయఁదగిన ప్రత్యుపకారమంతయుచేసి మేమాతని బహువిధముల గౌరవించినారము.— మీలో కొందఱు వెళ్ళి మఠద్వారమువద్ద నిలుచుండి పిలిచి యోగినిని మాయొద్దకు తీసికొనిరండు; మేమీమాతగవుతీర్చి మఱియిక్కడనుండి వెళ్లెదము.

[ఒకపరిచారిక ప్రవేశించుచున్నది.]

పరి—అమ్మా! పరుగెత్తుకొనివెళ్ళి వేగిరం నీప్రాణాలు దక్కించుకో. అయ్యగారున్నూ సేవకుడున్నూకూడా వదిలిపించుకొని ఇంట్లోవున్న పరిచారికల నందరినీ కొట్టి, భూతవైద్యుణ్ణి కట్టిపెట్టి గడ్డానికి నిప్పంటించినారు; అతడు గడ్డంకాలి యేడుస్తూవుంటే అద్భుతామని మొగంనిండా బురదవేసికొట్టి నిప్పారిపినారు. మనయజమానుడు శాంతించుమని అతనికి బోధచేస్తూవుండగా, లక్ష్మణుఁడు కత్తితీసుకుకొని వచ్చి అతనితల రేవురేవులుగా గొరిగినాడు. వెంటనే

మీరు యెవరినైనా పంపితేనే తప్ప వారిద్దరూ చేరి మంత్రగాణ్ని చంపివేస్తారు.

సీత—ఓసిపిచ్చిదానా నోరుముయ్యి నీయజమానుడున్నూ సేవకుడున్నూ యిక్కడనే వున్నారు. నీవు చెప్పినదంతా అబద్ధం.

పరి—అమ్మా! మీతోడు నేను నిజం చెపుతూవున్నాను. నామాట నమ్మండి. అతణ్ని నేనుచూచి తిన్నగా నిముషమయినా అయివుండదు. ఆయన నీపేరుపెట్టి పిలిచి యెక్కడవున్నావని కేకలు వేస్తూ, నీవు కనపడిన పక్షానికి నీమొఖంనిండా గంట్లుపెట్టి నిన్ను విరూపిని చెయ్యకపోతే తనపేరు మాఱుపేరు పెట్టుమని వొట్టుపెట్టుకుంటూవున్నాడు. (లోపల పెద్దవసంతకుఁడు కేక వేయుచున్నాఁడు.) అమ్మా! ఆలకించు! ఆలకించు ఆయనమాటలు వినఁబడుతూవున్నవి. ఇక్కడ నిలువకు; పరుగెత్తు.

ధర్మ—జడియకు. ఈలాగునవచ్చి నీవు నావెనుక నిలుచుండు— ఈతెలువుచ్చుకోని కాచుకోండి.

సీత—అయ్యో! అతఁడు నాభర్తే. అతఁడు యెలా కనపడకుండా వచ్చినాడో చూడండి. ఇంతకు మునుపు యితఁ డీమఠంలో ప్రవేశించడం చూచినాము· ఇప్పు డప్పుడే అక్కడవున్నాఁడు! అతఁడు ఇప్పుడక్కడి కేలావచ్చినాడో వూహించడానికైనా వీలులేకుండా మహాద్భుతంగా వున్నది.

[పెద్దవసంతకుఁడును పెద్దలక్ష్మణుఁడును ప్రవేశించుచున్నారు.]

పెద్దవ—న్యాయము దయచేయుండి ఓమహారాజా! న్యాయముదయచేయుండి. చిరకాలముక్రిందట నా దేహమున నెత్తురువఱదలుగట్ట గొప్ప గాయములు తగిలినను సాహసముచేసి మీకడ్డపక్షి

యుద్ధములో మీప్రాణములు కాపాడి మీ కుపకారము చేసినందున కయినను నాకు న్యాయము దయచేయుఁడు.

వర్ధ—(తనలో) మరణభీతివలన నామతి పోయియుండిన నేమో కాని లేకున్న వాండ్రిద్దఱును తప్పకుండ నావసంతకుఁడును లక్ష్మణుఁడును.

పెద్దవ—మహాప్రభూ! మీచాటున నిలుచున్న యిది నాకు చేసిన ద్రోహము విచారించి నాకు న్యాయము దయచేయుఁడు. దానిని మీరు నాకు భార్యనుగా దయచేయించినారు; అది నా కప కారముచేసి నన్ను గౌరవపఱచినది; ఈదినమున నాకిదిచేసిన యవ మానమును హానియు నింతంతయని చెప్పుట కలవి కానివి.

ధర్మ—నీకేమి యన్యాయము సంభవించినదో చెప్పుకో. నీకుతప్పక న్యాయముదొరకును.

పెద్దవ—ఓమహాప్రభువా! ఈదినమున నేను లోపలికి రాకుండ తలుపులు వేసి లోపల జారులను పెట్టుకొని హాయిగా విందారగించి నది.

ధర్మ—అది గొప్పతప్పితమే సీతా! నీవాప్రకారముగా చేసినావా?

సీత—మహాప్రభూ! నే నటువంటి అపరాధమేమీ చేయ లేదు. యీమధ్యాహ్నం నేనూ నాచెల్లెలూ తానూకలిసి భోజనం చేసినాము.

సుభ—మాఅప్ప దేవరవారితో మనవిచేసిందంతా సత్యము

విశ్వ—ఓసిమాయలాడీ! మీరిద్దరూ అప్రమాణమే చేసి నారు. ఈవిషయంలో యీపిచ్చవాడు చెప్పినదే వాస్తవం.

పెద్దవ—స్వామీ! నేను చెప్పినదంతయు యథార్థము, నే

నిప్పుడు త్రాగి మత్తుగొనియుండలేదు; కోపముచేత నొడలు తెలియకయు నుండలేదు; నాకు చిత్తోన్మాదమును గలిగి యుండలేదు. ఈదినము నేను భోజనమునకు రాకుండ ఇది తలుపులు లోపల గడియ వేసినది. ఈకంసాలికూడ కుట్రలో చేరియుండని పక్షమున, ఇతఁడు నాతో నున్నాఁడుగనుక నాపక్షమున సాక్ష్యమియ్యవచ్చును. ఇతఁడు మాతోఁగూడ కొంతదూరమువచ్చి ప్రభావతి యింటివద్దకు చంద్రహారము తీసికొనివచ్చెదనని చెప్పి తనయింటికి వెళ్ళినాఁడు; కాంచనగుప్తుఁడును నేనును గలిసి ప్రభావతియింటివద్ద భోజనముచేసినాము. మాభోజన మాయినతరువాత నతఁడక్కడకు రానందున కొంతసేపు చూచి నేనితనికొఱకు వెళ్ళినాను. నేనితనినివీధిలో కలిసికొన్నప్పుడు ఈపెద్దమనుష్యుఁడుకూడ నితనితో నున్నాఁడు. అప్పుడే అసత్యవాదియైన యీ స్వర్ణకారుఁడు నేనీదినమున తనవద్దనుండి చంద్రహారమును పుచ్చుకొన్నానని ప్రమాణముచేసినాఁడు. ఆచంద్రహారము నేనెఱుఁగనిసంగతి భగవంతునికి తెలియును. దానినిమిత్తమయి యితఁడు నన్ను రాజభటునకు కొప్పగింపఁగా, నేనులోఁబడి సొమ్ము నిమిత్తమై నాసేవకుడైన వీనిని మాయింటికిఁబంపి రానుగాని వీఁడుసొమ్ములేక పట్టిచేతులతో నే మరల వచ్చినాఁడు. నేనింటికివెళ్ళి సొమ్మిభటునివశమున నిచ్చిపంపెదనని రాజపురుషులను సమాధానపఱచి వచ్చుచుండఁగా త్రోవలో నాభార్యయు, దాని చెల్లెలును, మఱి కొంత అల్లరిమూఁకయు నాకెదురుపడిరి. వారు తమతో దుర్గాదాసను ఎముకలగూడువలెనున్న యొక జీవచ్ఛవమును కూడ తీసికొని వచ్చిరి. ఆవడపీనుఁగు తాను భూతవైద్యుఁడనని వేషము వేసికొని నానాడియు చూపులును పరీక్షించి నాకు భూతము సోఁకినదని అఱచినాఁడు. వెంటనే అందఱును నామీఁదపడి నన్నుకట్టిపెట్టి, తీసికొన్ని

వెళ్ళి, నా సేవకునినిగూడ త్రాళ్ళు వేసికట్టిమా యిద్దఱిని మా యింట నే యొక చీకటిగదిలో పెట్టినారు. నేను పండ్లతో గొఱికి కట్లు త్రెంపుకొని యీసంగతి మొఱపెట్టుకొనుటకు తక్షణమే యేలినవారి దర్శనమునకు పరుగెత్తుకొనివచ్చినాను. ధర్మస్వరూపులయిన దేవరవారు నాకీదినమున సంభవించిన మానభంగమునకును శ్రమకునుతగిన ప్రతిక్రియ చేయవలెను.

విశ్వ—మహాప్రభూ ! ఈయన యీరోజు యింటికాడ భోజనం చెయ్యలేదనిన్నీ ఖంటితలుపులు వేసి వేసినారనిన్నీ యింతవరకు మాత్రిం నేను సాక్ష్యం యివ్వగలను.

ధర్మ—అతఁడు నీయొద్దనుండి చంద్రహారమును పుచ్చుకొన్నాఁడా లేదా?

విశ్వ—పుచ్చుకున్నాఁడు మహాప్రభూ! ఈయన యిక్కడికి పరుగెత్తుకొనివచ్చినప్పుడు యీయన మెడలో చంద్రహారంవీరందరూ కూడా చూచినారు.

వర్త—అంగడివీధిలో నీవు మొదట చంద్రహారం యెరగనని ప్రమాణంచేసి తరువాత, నీవింతకుమును పే యిక్కడపుచ్చుకొన్నట్టు మళ్ళీ నీనోటితో వప్పుకోవడం నేను చెవులారా విన్నాను. అందుమీద నాకు కోపంవచ్చి నీతో యుద్ధమునకు సిద్ధం కాఁగా, జనుల మందనుజూచి నీ పీమఠంలోదూరి యెలాగో గారిడీచేత నీవామూల నుంచి ప్రత్యక్షమయినావు.

పెద్దవ—ఈమఠ సమీపమునకు నేనెప్పుడును రానులేదు. నీవు నాతో యుద్ధమునకు సిద్ధము కానులేదు. దైవసాక్షిగా నేను చంద్రహారము పుచ్చుకోనులేదు; నీవు నిష్కారణముగా నామీఁద దోషారోపణము చేయుచున్నావు.

ధర్మ—మీరందఱును ఒకదానికొకటి సందర్భించకుండ మాటాడుచున్నారు! మీరందఱును త్రాగియున్నారని నాకు సందేహముకలుగుచున్నది. ఇతఁడీయింటఁ బ్రవేశింపఁగా మీరు చూచియుండినపక్షమున; ఇతఁడిక్కడనేయుండి యుండును. ఇతనికి మతిచలనము గలిగియుండినయెడల, ఇతఁడింత శాంతతతో సహేతుకముగా మాటాడియుండఁడు. ఇతఁ డింటికడ భోజనము చేసెనని నీవు చెప్పుచున్నావు; ఇంటివద్ద భోజనము చేయలేదని యీకంసాలి చెప్పుచున్నాఁడు!—ఓరీ! నీవేమిఁ చెప్పెదవు?

పెద్దలక్ష్మి—స్వామీ! యీయన యీదినం యీప్రభావతి యింటివద్దనే భోజనం చేసినారు.

ప్రభా—ఈయన మాయింటికాడనే భోజనం చేసినారు; అప్పుడు నా వేలిది యీవుంగరంకూడా పుచ్చుకున్నారు.

పెద్దవసం—అవును. నీమాటనిజమే. ఈ మెయొద్దనే నీయుంగరమును పుచ్చుకున్నాను.

ధర్మ—ఇతఁ డీమఠములోనికి వెళ్ళుచుండఁగా నీవు చూచినావా?

ప్రభా—నేను నిశ్చయంగా చూచినాను మహాప్రభో!

ధర్మ—ఇదంతయు నత్యద్భుతముగా నున్నది. నీవువెళ్ళి యోగినిని మాకడకు పిలుచుకొనిరా—నాకు చూడఁగా మీ కందఱికిని పిచ్చియెత్తినట్టు తోఁచు చున్నది.

(ఒకసేవకుఁడు వెళ్ళుచున్నాఁడు.)

వర్ధ—మహాప్రభూ! నేనొక్కమాట వీరితో మాటాడుటకు నాకనుజ్ఞ యిచ్చెదరా? సామ్మిచ్చి నాప్రాణమును కాపాడఁగలవాఁడిందులో నొకఁ డున్నట్టు కనఁబడు చున్నాఁడు.

సీత—నాకిద్దఱుభర్తలు కనఁబడుతూ వున్నారు! నాకళ్ళకు భ్రమగప్పినదా యేమి?

ధర్మ—వీ రొకరి కొకరు ప్రతిబింబములవలె నున్నారు. వీరిలో నిజమయినవాఁ డెవఁడో యెవరు నిర్ణయింపగలరు?

చిన్నల—లక్ష్మణున్ని నేను. యీ రెండో వాణ్ని అవతలకు పంపివెయ్యండి.

పెద్దల—నేనులక్ష్మణున్ని నన్నిక్కడ వుండనియ్యండి.

చిన్నవ— మీరు వర్ధమానులా? లేక ఆయనప్రతిబింబమా?

చిన్నల — ఓహో! నాపెద్దయజమానుఁడు! ఈయనను ఈప్రకారంగా కట్టి యెవ రిక్కడకు తీసుకువచ్చినారు?

యోగిని—యెవరుతీసుకువస్తేనేమి? నే నీయనకట్టువిడిపించి మళ్ళీభర్తను సంపాదించుకొంటాను. ఓపుణ్యాత్మా! పూర్వము చారుమతి అనేభార్యను వివాహం చేసుకుని ఆమెవల్ల యిద్దఱుకవల పిల్లవాళ్ళను కన్న వర్ధమానులు మీరేనా? ఈచారుమతితో మాటాడండి.

వర్ధ—నే నిప్పుడు స్వప్నావస్థలో లేనిపక్షమున నీవు నిశ్చయముగా చారుమతివే. నీవుచారుమతివే యయినయెడల, అప్పుడునీతో గూడ సముద్రములో తేలిబ్రతికిన పుత్రుఁ డెక్కడనున్నాఁడో చెప్పు.

చారుమ—నన్నూ నాకొడుకునూ సేవకుఁడయిన లక్ష్మణున్నీ తమపడవలలో యెక్కించుకొన్న చేపలవాళ్లు దుర్మార్గంచేసి పిల్లలిద్దరినీ బలాత్కారంగా నాదగ్గిరనుంచి తీసుకుపోయి యెవరికో అమ్ముకొన్నారు. తరువాత వారిస్థితి యేమైనదో నాకు తెలియదు. నేను చిరకాలం అక్కడవుండి తరువాత యీపట్టణంచేరి నాలుగేళ్ళనుంచి యీమఠంలో యోగినినిగా వున్నాను.

ధర్మ—ఇతఁడీప్రాతఃకాలమునఁ జెప్పినకథ యిప్పుడు నిదర్శనముగా కనఁబడుచున్నది. ఈయిద్దఱు వసంతకులు నేకరీతిగా నున్నారు; ఆప్రకారముగానే యీయిద్దఱు లక్ష్మణులునుకూడ నచ్చునఁ బోడిచిన ట్లొకవిధముగా నున్నారు. దైవవశముచేత నకస్మాతుగా కలిసికొన్న వీరిద్దఱును వీరిజనకులు.—వసంతకా! నీవు మొట్టమొదట రామనాథపురమునుండియే కాదా కాశిహస్తితీసికొని రాఁబడినావు?

చిన్నవ—నేను కాను. నేను మథురాపురమునుండివచ్చినాను.

ధర్మ—నీవు దూరముగా నిలుచుండు. మీలో నెవరెవరో నాకే భేదము తెలియకుండ నున్నది.

పెద్దవ—రామనాథపురమునుండి వచ్చినవాఁడను నేను మహాప్రభూ!

పెద్దల—ఈయనతో కూడా వచ్చినది నేను.

పెద్దవ—మమ్మిక్కడకు తీసికొనివచ్చి దేవరవారి కొప్పగించినది మీ మేనమామగారైన సుబలుఁడను మహావీరుఁడు. వల్లెవాండ్రవద్దనే మమ్మాయనకొని పెంచినారు.

సీత—మీయిద్దరిలో నెవరు యీమధ్యాన్నం నాతో భోజనంచేసినారు?

చిన్నవ—నేను.

సీత—మీరు నాభర్తగారు కారా?

పెద్దవసం—అతఁడు నీభర్త కాఁడని నేను రూఢిగా చెప్పఁగలను.

చిన్నవసం—నేనును మధ్యాహ్న మీమాటయే యీమెతోఁ జెప్పినాను; ఈమె నామాట నమ్మినదికాదు.—ఓసుభద్రా! నేను

మధ్యాహ్నము నీతో నేమిచెప్పినానో స్మరించు కొనుము; ఆ మాట నిజముచేయుటకు సమయమువచ్చుచున్నది.

విశ్వ—మీరు నావద్దపుచ్చుకున్న చంద్రహారమదే.

చిన్నవ—అవును. ఎవరు కాదన్నారు?

పెద్దవ—ఈ చంద్రహారము నిమిత్తము నీవు నన్ను రాజభటుల కొప్పగించినావు.

విశ్వ—అవును కాంబోలును.

సీత—నేను లక్ష్మణునిచేత మీకు ధనం పంపినాను. వాడు మీకిచ్చినాడు కాడు.

పెద్దల—లేదు. నాచేత నీవు సొమ్ము పంపలేదు.

చిన్నవ—ఈరూపాయలమూట నాసేవకుడు తెచ్చి నాచేతి కిచ్చినాడు. మన మొకరిసేవకుని నొకరిసేవకునిగా భ్రమించుటవలన ఈచిత్రములన్నియు పుట్టినవి.

పెద్దవ—ఈధనము నేను నాతండ్రి ప్రాణరక్షణముకొఱ కిచ్చెదను.

ధర్మ—నీధనదాన మక్కఱలేకయే నీతండ్రికి మేము ప్రాణదానము చేసినారము.

ప్రభా—ఆవజ్రపుటుంగరము మీ వేలిది నాది.

పెద్దవ—అవును. నీయుంగరమిదిగో నీవుపుచ్చుకో.

(అని యిచ్చుచున్నాడు)

చాకు—ఓమహారాజా! దేవరవారు మాతో యీసమయంలోకి విచ్చేసి, సావకాశంగా సంభాషణచేసి, కొంచెంసేపు మా గృహాపావనం చెయ్యవలెనని వేడుకొంటూవున్నాను. యీరోజున యిక్కడ పోగయి మామూలుగా శ్రమపడ్డవారందరూ కూడా

లోపలకు దయచెయ్యవలెను; మేము మిమ్మల్నందరినీ సమాధానం చేసి పంపుతాను. ఓపుత్రులారా! మిమ్మల్ని యెడబాసి యిరవై సంవత్సరాలైనది; యింతకాలమునకు యెప్పుడూ యెదురుచూడని దే మనమందరమూ వక్కచోట కలుసుకున్నాము గనుక లోపలికివెళ్ళి కొంచెంసేపు సల్లాపసౌఖ్యం అనుభవింతాము రండి.

ధర్మ—మిక్కిలి సంతోషముతో లోపలకువచ్చి మీసంభాషణవిని వేడుకపొందెదము.

(రాజును, చారుమతియు, వర్ధమానుఁడును, ప్రభావతియు, వర్తకుఁడును, విశ్వకర్మయు, పరిజనమును వెళ్ళుచున్నారు.)

చిన్నల—అయ్యా! బండిమీద యెక్కించడానికి తీసుకొని వెళ్ళిన మీసామాను పట్టించుకురానా?

పెద్దవ—నాది యేసామాను బండిమీఁద నెక్కించినావు?

చిన్నల—సత్రమువద్దనున్న మీసరకులు.

చిన్నవ—వాఁడు నాతో చెప్పుచున్నాడు. లక్ష్మణా! నీ యజమానుఁడను నేను. అవి తరువాత తీసికొని రావచ్చును. మాతో లోపలికి రా. ముందు నీసోదరుని కౌఁగిలించుకొని మీరిద్దఱునుకలిసి లోపలికిరండి. (పెద్దవసంతకుఁడును, చిన్నవసంతకుఁడును, సీతయు, సుభద్రయు, లోపలికి వెళ్ళుచున్నారు.)

చిన్నల—నీయజమానుడి యింటికాడ కొండంతమనిషివకత్తె కనపడ్డది. అది నన్నుచూచి నీ వనుకున్నది; నా వదినెగారు కాఁబోలును!

పెద్దల—యెలాగు భ్రమపుట్టకుండా వుంటుంది? సరిగ్గా నీవు నా అద్దంలో నీడలాగు వున్నావు. నీరూపాన్ని చూస్తే నేనూ అంత గాణ్నే అని తోస్తుంది. మనంకూడా లోపలకు వెళుదాముురా.

చిన్న—నీవు పెద్దవాడవు. ముందర నీవు నడువు.

పెద్దల—ఆభేదం మనకుతప్ప యెవరికీ తెలియదు. అందరికీ తెలియడానికి యేమిచేశాం ?

చిన్నల—అందరికీ తెలియడానికి తరువాత మనం యేమైనా ఆనవాలు వేసుకుందాము. అందాకా నీవు ముందర నడువు.

(అని వెళ్లుచున్నారు.)

సంపూర్ణము.

—:o:—

బాబ్నా ప్రెస్, రాజమండ్రి 1950.

శ్రీ

రాగమంజరి

గ్రంథకర్త:-

కందుకూరి వీరేశలింగము పంతులు

నాల్గవకూర్పు

ప్రకాశకులు:-

హితకారిణీసమాజము

రాజమహేంద్రవరము

1950

ఈ నాటకమునందువచ్చు పాత్రములు

పురుషులు

1. సుదర్శనవర్మ—విజయవర్మకును, భానుమతికిని తండ్రి.
2. విజయవర్మ—సుదర్శనవర్మకొడుకు; సుదంతప్రియుఁడు.
3. కామపాలుడు—భానుమతిప్రియుఁడు.
4. వసుకాముఁడు—భానుమతిని వివాహమాడఁగోరినవాఁడు.
5. చంద్రకేతుఁడు—వసుకాముని మిత్రుఁడు.
6. నారాయణశర్మ—పురోహితుఁడు.
7. గండభేరుండాచార్యులు—కేశవస్వామి యర్చకుఁడు.
8. కంఠీరవాచార్యులు—రెండవయర్చకుఁడు.
9. దామోదరుఁడు—విజయవర్మ సేవకులలో నొకఁడు.
10. దారకుఁడు—సుదర్శనవర్మ సేవకులలో నొకఁడు.
11. ఘటకుఁడు—సుదర్శనవర్మ సేవకులలో నొకఁడు.

స్త్రీలు

12. భానుమతి–సుదర్శనవర్మకూతురు; కామపాలునిప్రియురాలు.
13. సుదంత—విజయవర్మప్రియురాలు; మాధవసేనునికూతురు.
14. రాగమంజరి—భానుమతి పరిచారిక.
15. చతురిక—భానుమతి పరిచారిక.
16. సుదంతపరిచారిక.

స్థలము—ఉజ్జయినీనగరము.

రాగమంజరి

ప్రథమాంకము

౧ రంగము — సుదర్శనవర్మ గృహముముందరి వీధి

[లాంతరు పట్టుకొని దామోదరుఁడు ప్రవేశించు చున్నాఁడు.]

దామో — ఏమీ! అప్పుడే మూఁడుగంటలు దాటిపోయిన దిగా! ఉజ్జయినీనగరవీధులలో నొంటిగా నిశాచరునివలె తిరుగుటకు నావంటిదూత కిది తగినసమయమే. అన్ని కొలువులలోను పడుచుఁదనములో నున్న నాయకునికొలువు కొలుచుట బహుకష్టము. ఇట్లు చెప్పుట నేను వలపుసంగతి యెఱుఁగకపోవుటచేత కాదు. నావలపునకును నా యజమానునివలపునకును కావలసినంతవ్యత్యాస మున్నది. నాప్రభు వైనవిజయవర్మ వలపు నిద్రాహారములను తలపెట్టనియ్యదు: ఇఁక నావలపో కడుపునిండ తిని హాయిగా నిద్రపోయినతరువాత కలలోఁ గాని బయలు దేఱదు. ఇప్పుడీతలపోతల కవకాశము లేదు. నాప్రభు వక్కడ తనప్రియురా లయిన సుదంతగదిలోనుండి తప్పించుకొని వచ్చుటకయి నాసాహాయ్యము కోరి యెదురు చూచు చుండును. (వెలపల సంగీతము) ఇది యేమి? సంగీతము. వినఁబడు చున్నది! ఎవరు వచ్చియుందురు? నాయజమానునిమిత్రుఁడయిన కామపాలుఁడు మాప్రభువుసోదరి యైన భానుమతికి వినఁబడునట్లుగా పాటపాడుట కయి యిప్పుడు మాఱువేషముతో వచ్చి యుండును. ఇఁక నాముసలి యజమానుఁడు లేచిరాక మానఁడు. అతఁడు తనకొడుకింటఁ లేఁడని యనుమానపడకుండ నాస్థానమునకు పోయి నేను నిలిచి యుండెదను.

(అని పోవు చున్నాఁడు)

[అప్పుడు తనమిత్రుని నొకని తోడుచేసికొని కామపాలుఁడు మాఱువేషముతో ప్రవేశించి పాడుచున్నాఁడు.]

ద్విపద. చెప్పవెూ వీణియ! చెచ్చెరనాకు
ఇప్పుడు వెడలు నీమృదులస్వరంబు
నీయజమానుని నెమ్మదిలోని
పాయని వెతయెల్లఁ బల్కఁగాఁగలదె?
పటుమతి నిటఁగ్రిందఁ బాడువా రెవరొ
పుటపుటనిట్టూర్పు పుచ్చువా రెవరొ
నలువొందనిద్రించు నాప్రియురాలు
తెలిసికోవలసిన, తెగువమైనామె
కమ్మనినిద్దుర కనుఁబాయకుండ
నిమ్మళంబుగఁబాడి నిట్టూర్పు లిమ్ము.
ఏ నింతకంటెను హెచ్చుగాఁదెల్పఁ
బూని తెగింపకయుండె స్వప్నమున
నాభాగ్యదేవత నళినాక్షి చెవిని
సాభిలాషగబోధ సలుపునుగాక!

మిత్రు—కామపాలా! నీవీలాగున దీనముగా పాడుచున్న యెడల నీప్రియురా లెప్పటికిని మేలుకొనదు. ఉయ్యేలలోనున్న పసిబిడ్డ వలె వలపుసహితము జాలిగొలుపు పాటలచేత జోకొట్టఁబడి మఱింత నిద్రపోవును.

కామ—ఆమెకు నిద్రాభంగముచేయ నామనసు కొలుపదు.

మిత్రు—మేలుకొల్పినయెడల లేచివచ్చి పల్కరించునంతటి గౌరవమా మెకు నీయందు లేదని యెఱుఁగుదువు గనుక నే నీ వామె నిద్రాభంగమున కింత భయపడు చున్నావు.

కామ—అట్లయిన నీకిప్పు డాసందేహము తీర్చి నమ్మకము పుట్టించెదను చూడుము. (అని పాడుచున్నాఁడు.)

ఉ. వేకువ చేరవచ్చి యిదె వేగమె రాత్రిని సాగనంపెడున్;
నీ కమనీయనేత్రముల నీవిఁక విప్పుము, సుందరీమణీ!
యీకడ నీసురూప మనులింపఁగ ప్రొద్దుదయించు నంతకున్
నాకు వెలుంగు గన్పడదు, నాకుఁబగల్ గనిపించ దింతయున్

భానుమతి—(ఒకగవాక్షమునుండి బదులు పాడుచున్నది.)
సుగంధివృత్తము. విన్నదాన లేచి నన్ను వేఁడు నీదుగీతమున్;
కన్నదాన నేత్రరంజకంబుగాఁ బ్రభాతమున్;
నన్నుఁ బాటపాడి వేఁడు నాయకున్ మనంబులో
నెన్నుకొంటిఁ గామఁ డంచు నిమ్మహీజనంబులో.

సుదర్శనవర్మ—(మఱియొక గవాక్షమునుండి) ఎవరురా తులువలు గాణలతోను వీణలతోను రాగములతోను భోగములతోను ఆటలతోను పాటలతోను మావీధిని చేరి యల్లరి చేయుచున్నారు? పొండి, పాటకులారా! పరుగెత్తిపొండి.

భాను—నాన్నగారూ! వృధాగా మీరు రేల యిట్లాగ్రహపడెదరు? ఊరకుండుడు.

కామ—ప్రియురాలా! నేను నీవిధేయ సేవకుఁడను.

సుద—అమ్మాయీ! ఆమోసపుమాటలను నీవు చెవియొగ్గియేల వినెదవు? గవాక్షములోనుండి లేచి రా.

భాను—ఓప్రియుఁడా! అనుజ్ఞ వేఁడుకొనెదను.

కామ—నీవు పోకతీఱదా?

భాను—మనమొకవేళ మరలశీఘ్రముగా నేకలిసికోవచ్చును. మనకు దురదృష్ట మొకగొప్పశత్రువుగా నున్నను, మనపక్షమునా.

దానితో పోరాడి విజయ మిచ్చుటకు మిత్రుడయి, కాముఁడున్నాఁడు.

సుద——ఓరీ! తుపాకి యిటు తెమ్ము.

కామ——మన మనోవేదన నెఱిఁగిన కామదేవుఁడు—

సుద——పొండి. పోకుండినయెడల, ఈగుండు తిన్నగా మీతల లోనుండి దూఱిపోవును.

(అందఱును వేఱు వేఱుగా నిష్క్రమించుచున్నారు.)

---

౨ రంగము——వీధిలోని వినోదమంటపము.

[విజయవర్మయు, దామోదరుఁడును ప్రవేశించుచున్నారు.]

దామో——అయ్యా! వారమున కొక్కసారి కొంచెమునిద్ర-

విజ——ఓరిజడుఁడా! ఊరకుండు. నావద్ద నిద్రపేరు తలపెట్టకు.

దామో——స్వామీ! దేవరవారివిషయములో నేను మనవి చేయవచ్చునది నావంటిదరిద్రులకుపట్టెడు తుచ్ఛమయినగాఢనిద్ర మాట కాదు. కొంచెము కావలసి యున్నయెడల వేడుకకొఱకొక్క సారి గడియసేపు కన్నుమూసెడిప్రభువుల చిఱునిద్రను గుఱించియే నేను దేవరవారితో విన్నపము చేయుచున్నాను.

విజ——ఓరిమూఢుఁడా! నోరు మూయుము. ఓసుదంతా! ఓప్రియురాలా! నీ వెంత నిర్దయురాలవై నాకన్నులనుండి నిద్రను దొంగిలించినావు!

దామో——(తనలో) నానిద్రకుకూడ దొంగిలించింది.

విజ——ఇటువంటి సమయములో నామనోరథమును వ్యర్థపుచ్చుట నాకు మరణప్రాయముగా నున్నది. మరియాదలనిమిత్తమేము చూచుకొనుట కవకాశముసుము? ఇదె ప్రేమగలిగినసుసు

లక్షణమా? నీ వెప్పుడును నన్ను మనసార ప్రేమించితి వని నే ననుకోను.

దామో—(తనలో) నేనును అనుకోను.

విజ—అట్లుగాక స్త్రీజనస్వాభావిక మయినచపలత్వమును బట్టి మనస్సు గడియ గడియకును మాఱుచుండుటచేత ని ట్లని యుండునా?

దామో—(తనలో) స్త్రీలచిత్తములు క్షణక్షణమునుమాఱు చున్నను వారుమాత్ర మది యొప్పుకోరు.

విజ—ప్రపంచములో సుదంతవలె నవివేకిను లగువారు మఱియెవ్వరైన నున్నారా?

దామో—(తనలో) నాకొక్కఁడు కనఁబడు చున్నాఁడు?

విజ—ఉన్నారు. ఆమె చపలత్వమునకు దాసుఁడయి యున్న యీబుద్ధిహీనుఁ డటువంటివాఁడే. (అని తన్ను చూపుకొనుచున్నాఁడు)

దామో—(తనలో) ఈసంగతి యితఁడు తెలిసికోఁగలఁడని నేనీవఱకే యనుకొన్నాను.

విజ—ఓహో! నీ వెంత చంచలురాలవు! ఓదయావిహీను రాలా! తెలివిమాలిన నీనుష్కరత్వముచేత నన్నెంత దుఃఖపెట్టు చున్నావు! నాదృష్టికి నీవిప్పుడు దోషరాశివిగాఁ దోఁచుచున్నావు. నీచూపులే కావలసినంత తిరస్కారమును వెడలఁగ్రక్కుచున్నవి. ఒక్కచూపులే కావు నీచిఱునవ్వులును. అయ్యో! నేనిప్పు డాచిఱు నవ్వుల నేల తలపెట్టితిని? ఆమె సుందరమందహాసములోనే దృష్టిని మిఱుమిట్లు గొల్పెడు సోయగమును హృదయమును మరులుకొల్పెడు విభ్రమమును నామనస్సునకు పొడకట్టుచున్నవి. సాకిప్పుడు మరణో

స్వాదము లాసన్న మగుచున్నవి. నా ప్రియురాలు లభింపక పోయిన యెడల నేనిఁక ప్రాణత్యాగము చేసికొనెదను.

దామో—(తనలో) ఔరా! అవిషపునవ్వులే యందఱిని జెఱుచుచున్నవి.

విజ—(పాడుచున్నాఁడు)

ద్విపద. సుగుణసంపదమెల్ల సొరిదిని మఱచి
మగువదోషంబులె మదిని నిల్పంగఁ
జాలుదు నేని, నిష్పతిపాతమునఁ
గ్రాలువివేకంబు కడువేగఁ గాముఁ
డామ దుర్బలుఁగాఁగఁ దప్పక చేయు;
కాని, కోపమువచ్చి కాంతదోషముల
నెన్నంగ మదిలోన నేఁ బూనినపుడు
క్రన్నన నడుమను గాముండు వచ్చి
కలికిసద్గుణములఁ గాన్పించి నాకు
నల వివేకము నిట్టె యంధంబుఁ జేయు.

దామో—స్వామీ! కామపాలుఁ డిటువచ్చుచున్నాఁడు.

విజ—మంచిది. నీవింటికిపొమ్ము. నేనును నీ వెనుక నే వచ్చెదను.

దామో—ఆహా! ఆకుత్సితపునవ్వులు!

(అని నిష్క్రమించుచున్నాఁడు)

[అప్పుడు కామపాలుఁడు ప్రవేశించుచున్నాఁడు]

విజ—కామపాలా! నీవు మాగుమ్మమువద్ద పాడుచుండఁగా మిమ్ము విడిచివచ్చినానని దామోదరుఁడు చెప్పినాఁడు. మా తండ్రిగారు లేవలేదుగదా?

కామ—లేచినారు. ఆయన సంగీతప్రియులుఁగనుక, ఇనుప కమ్ములు వేసిన గవాక్షములో నిలుచుండి బోనులోని పండుకోతివలె కావలసినంతసేపు గొంతు బద్దలుచేసి కొండని లేచివచ్చినాను. నీ వింత పెందలకడనే యిల్లుబైలుదేఱివచ్చుటకు కారణమేమి?

విజ—నీతో చెప్పినానో లేదో కాని సుదంతసవతితల్లి తనభర్తయైన మాధవసేనుని సొత్తంతయు తాను గన్నకొమార్తెకే యిప్పించవలెనని తంత్రముచేసి తండ్రి నొడఁబఱిచి సుదంతను యోగినినిగా మఠమున కర్పింప నిర్ణయించుకొన్న దినము రేపేసుమా. అందుచేత నేను సర్వమునకు తెగించి, వీధితలుపు తాళముచెవి కష్టపడిసంపాదించి; లోపల గడియవేయకుండ సుదంత పరిచారికకు లంచమిచ్చి, తెల్లవాఱుజామున రెండుగంటలకు రెండవకంటివా రెఱుఁగకుండ లోపల ప్రవేశించి, సుదంతగదిలో దొంగతనముగా దూఱినాను. అప్పుడు నాప్రియురాలు మేలుకొని కూరుచుండి కన్నులనీరు పెట్టుకొనుచున్నది.

కామ—ఓవిజయవర్మా! నీ వదృష్టవంతుఁడవు.

విజ—తొందరపడక పర్యవసానము వినుము. రాత్రిపూట వేళగానివేళను వచ్చి తనగదిలో ప్రవేశింప సాహసించినందుకు నన్నామె పరమ సాహసికుఁడయిన దుష్టవర్తనునితో సరిచేసినది.

విజ—ఇది యారంభదశలోలేదు. అదేయంత్యదశ. అటుతరువాత నామాట యొక్కటియైనను వినిపించుకోక తత్క్షణము గదివిడిచి లేచి పోనిపక్షమున తనతల్లిని లేపెదనని బెదరించినది.

కామ—మంచిది కడపట నేమిజరిగినది?

విజ—కడపటనా? మొదట నేను లోపలప్రవేశించినట్లుగా నే

మరల చేతు లూఁచుకొనుచు మాఱుమాటాడక లోపలినుండి వెలుపలికివచ్చుట జరిగినది.

కామ—ఆమెకు కోపమువచ్చునని నీవక్కడ నేమియు చేయలేదుగదా?

విజ—దైవముతోడు! నే నేమియు చేయలేదు. పది పండ్రెండుసారులు మాత్రము బలవంతముగా బుగ్గలు ముద్దుపెట్టుకొన్నాను.

కామ—అంతేకద? అటువంటి మోటుతనము నే నీవల కెన్నఁడును వినియుండలేదు.

విజ—ఛీఛీ! నేను మోటుతన మింతమాత్రమును జూపలేదు. నామాటనమ్ము. నే నామెయెడల మిక్కిలి గౌరవముతోనే నడచుకొన్నాను.

కామ—ఈశ్వరసాక్షి! నీవిషయమయి చెప్పలేదు. నే నది సుదంతవిషయమయి చెప్పినాను. విజయవర్మా! నీవు తలుపు తాళము చెవి వారివద్ద నిచ్చియే వచ్చినావుగదా?

విజ—ఇచ్చివచ్చినాను. నన్ను సాగనంపుటకయి వెలుపలికి వచ్చిన పరిచారిక తీసికొనిపోయినది.

కామ—అట్లయినపక్షమున, సుదంత రూఢిగా నీవెనుక నే యిల్లువిడిచివచ్చునని నేనిప్పుడు ప్రమాణముచేసి చెప్పఁగలను.

విజ—ఒకవేళ నాప్రతిపక్షి నెవ్వరినైన ధన్యునిజేయుటకయి వచ్చునేమో! నాప్రస్తుతస్థితినిబట్టి విచారింపఁగా నాకిప్పు డందఱియందును సందేహము కలుగుచున్నది. వెనుక నీవుకూడ సుదంతను కామించి, నావలెనే యామెను భాగ్యదేవతనుగా భావించుకొనుచుంటివి కాదా?

కామ—ఆమెకు నామీఁద ననురాగము లేదని తెలిసికొను వఱకును నేనామెను మోహించినాను. కాని నేనటుతరువాతవరింపఁ దగినశుభలక్షణ మొక్కటియు నామెముఖమునందు లేదనుకొనితుద కభావ విరక్తి చేసికొని మరలుకొన్నాను.

ద్విపద. కాంతతోడను నన్నుఁ గాంచనికనుల
వీక్షింప ఘనశోభ నెప్పుడును నేను;
ఏనానఁగా లభియింపనిమోవి
నేను సుధారస మెప్పుడుఁ జూడ;
తద్దయు ననుఁగోరు తరళాయతాక్షి
నిద్దపుఁజెక్కుల నెఱిమించు నేని,
పలుముద్దు లిడి నేను పరికించుదాక
తళుకుఁజెక్కు లటంచుఁ దలఁపను నేను
ఏణాక్షిహస్తంబు మృదువందు రేని,
పాణినంటుచు నేనె పరికింపవలయు;
మరలఁ గృతజ్ఞత మగువ నాచేయి
కరుణఁబట్టినదాఁక కనినమ్మ నేను.
పొలఁతినిట్టూర్పులు పుచ్చుచునుంట
తిలకింపవలసినఁ దేటగా నేను,
యువతి నన్నాశించి యూర్పుచున్నట్టు
లవగతమైనఁగా కరయులే నేను.

అంతేకాక నీచెల్లియందు నాకు గాఢానురాగ మున్నసంగతి నీకు దృఢముగా తెలియునుగదా? ఆవిషయములో నాకు నీవు తోడు పడుము. సుదంతవిషయములో నీకెంతమాత్రమును నేను శ్రమ కలుగనియ్యను.

విజ—మాకుటుంబగౌరవమునకు హానిరాకుండ నాకు సాధ్యమయినంతవఱకు నేనావిషయములో నీకు సదుపాయము చేసెదను. కాని యింటినుండిమాత్రము నీవు భానుమతిని లేవఁదీయఁగూడదు సుమా.

కామ—ఇంటినుండి సుదంతనుమాత్రము నీవు లేవఁదీయు ప్రయత్నము చేయవచ్చునా?

విజ—అది వేరేసంగతి. పరులవిషయములో మనము జరిగించునట్టుగా మనభార్యలవిషయములోను మనతోఁబుట్టువులవిషయములోను పరులు జరిగించుటకు మన మొప్పకోము. ఇక్కడ మఱియొకసంగతికూడ నున్నది. రేపటిదినము సుదంతను బలాత్కారముగా యోగినిని జేయఁబోవుచున్నారు.

కామ—సరే. ఇప్పుడు నేనుమాత్ర మటువంటి నిర్భాగ్యస్థితిలో లేనా? రేపటిదినము మీతండ్రియు భానుమతిని బలవంతముగా వసుకామునకిచ్చి వివాహము చేయఁబోవుచున్నాఁడు. నాతో రా. మన మేదయిన నుంచియుపాయము నాలోచింతము.

విజ—నే నింటికి పోవలెను.

కామ—మంచిది. నాకు సెల విమ్ము.

విజ—అవునుగాని, కామపాలా! నీకొకవేళ నాచెల్లెలిమీఁద ననురాగము లేకపోయినను మర్యాదయు మనస్నేహమును విచారించి సుదంతవిషయములో నీ వేమియు విఘ్నము తలపెట్టకూడదుసుమా.

కామ—గీ. ధర్మమూలంబు మైత్రి యుద్ధరణిమీఁద;
మనుజులను జేరి వలపు పైకొనియె నేని,
వలపునకుఁ దాము ననుకూలపడకయున్న
నిలువవే ధర్మములు నొక్కనిమిషమైన.

గీ. నేను జెలులకుఁ జేయు వాగ్దానములను
లౌక్యధర్మంబులంచుఁ దలంతు నెపుడు;
వలపునకుఁ జేయు నలప్రమొక్కుబడుల నెల్ల
నేను మతధర్మము లటంచు నెంతు మదిని.

(అని నిష్క్రమించు చున్నాఁడు)

విజ—ఈవిషయ మయి కామపాలునితో నేనెప్పుడు ప్రసంగము చేసినను నాకీతనిచర్య యేమో వక్రముగా నేకనఁబడుచున్నది. అందువలన నామనస్సున కారాటము హెచ్చుచున్నది. ఇంతకువచ్చిన మీఁదట సుదంత యీతనిని వరించునేని నేను నిశ్చయముగా ప్రాణములు విడువవలసినవాఁడనే.

మ. అనుమానింపఁగ హేతువున్న, నను నాయజ్ఞాంతికి కామించునం
చును దెల్పంగ నిదర్శనంబులె కడుంజూపట్టు; నాశంక యిం
కను సత్యంబగునేని నేను జెడితిన్; గాదేని నేసౌఖ్యముం
గన నర్హుండనుగాను; లోనఁబెనుచుం గాయీర్ష్యదుఃఖంబులన్.

ఉ. నాయెడ నాతిమిన్న చిఱునవ్వొలయించిన నెంతపూజ నేఁ
జేయఁగఁజెల్లునో యెఱుఁగఁ; జేడియనవ్వులె యన్యుఁజేరినన్
బాయఁగఁజెల్లు నావలపు; నామది వేదన యెట్లుతీఱెడున్
బ్రేయసి నన్నిటుల్ వెతలఁబెట్టుకొలందిని ప్రేమహెచ్చగన్!

(అని నిష్క్రమించు చున్నాఁడు)

---

3. రంగము—సుదర్శనవర్మ గృహములోని గది.

[భానుమతియు, రాగమంజరియు ప్రవేశించుచున్నారు]

భాను—ఓ చెలీ! రాగమంజరీ! మన మాలోచించిన యుపాయము నిరపాయముగా సాగునని నీకు నమ్మక మున్నదా?